Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03



# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## తొలి పుట్టినరోజు...




అవును ఇది తొలి పుట్టినరోజే. గత 33 సంవత్సరాలుగా నెల్లూరీయుల గుండెల్లో పదిలమైన స్థానాన్ని పొంది ప్రగతి ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న "లాయర్"కి ఇది తొలిజన్మదినం. స్వార్థ రాజకీయనేతల విభజించు పాలించు సిద్ధాంతానికి బలైపోయి అనాథగా మిగిలిన అవశేష ఆంధ్రప్రదేశ్‌లో "లాయర్" జరుపుకున్న తొలి జన్మదినం ఈ జూన్ 5.

ఇన్నాళ్ళూ మన మేధస్సునంతా ఉపయోగించి అంధకారంలో వున్న ప్రాంతంలో మన జ్ఞానాన్ని, పరిజ్ఞానాన్ని పెట్టుబడిగా పెట్టి అభివృద్ధి బాటలో ఆ ప్రాంతాన్ని నడిపించి నేడు వారిచేత మెడపట్టి గెంటించి వేయబడినందుకు చింతించాలో, లేక ఇప్పడైనా మనల్నే మనం బాగుచేసుకుందాం మన ప్రాంతాన్నే మనం సస్యశ్యామలం చేసుకుందాం, మన మేధస్సును మన కోసమే వాడుకుందాం అనే నినాదంతో అవశేష ఆంధ్రప్రదేశ్‌ని విశేషాంధ్రప్రదేశ్‌గా యావత్ భారతదేశం గర్వించేలా తీర్చిదిద్దుకోబోతున్నాం అని సంతోషపడాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో 'లాయర్' జరుపుకున్న 33వ జన్మదినమిది.

గత 33సంవత్సరాలుగా మా(మీ) 'లాయర్' అన్నివేళలా ప్రజల పక్షమే నిలిచింది. ప్రజల వాణినే బాణిగా వారి ఆశయ సాధనలో చుక్కానిగా తన యాత్రను కొనసాగిస్తూనే వస్తోంది.

'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు చూపిన బాట, నేర్పిన మాటే ఊపిరిగా ఆయన ఆశయాలే లక్ష్యంగా, ఆయన ఆదర్శాలే ప్రమాణాలుగా పత్రికను పాఠకుల ముంగిళ్ళలో వుంచడానికి వారం వారం నిరంతరాయంగా అక్షరసమరం సాగిస్తూనేవున్నాం.

గత 33సంవత్సరాలుగా మా(మీ) 'లాయర్'ని ఆదరించి చేరదీసి అక్కున చేర్చుకున్నవారి నమ్మకాన్ని వమ్ము కానీయకుండా, వారి ఆకాంక్షలకు, వారి ఆలోచనలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు అవసరమైన మార్పులు చేసుకుంటూ, మారుతున్న నేటి కాలానికి తగ్గట్లుగా పత్రిక రూపురేఖలను మార్చుకుంటూ, కొత్త అందాలతో వారి మానసపుత్రిక 'లాయర్' వారపత్రికను ముస్తాబు చేసుకుంటూ ముందుకు సాగుతూనే వున్నాం.


నిమిషానికో టివి ఛానెల్ పుట్టుకొస్తూ ప్రతి సెకనుకీ ప్రపంచ వ్యాప్త వార్తలునందిస్తున్న తరుణంలో తనదైన శైలిలో ప్రపంచ వ్యాప్తంగా వున్న లక్షలాదిమంది నెల్లూరీయుల కంప్యూటర్‌పై ఇంటర్నెట్ ద్వారా వారం వారం ప్రత్యక్షమౌతూ నెల్లూరీయులకు నెల్లూరు విషయాలని, విశేషాలనీ అందించడంలో విజయవంతమయ్యింది మా(మీ) 'లాయర్'. లక్షలాది కాపీలతో వీధివీధికీ ఓ సంచికతో సందు వార్తలకు సైతం ప్రాధాన్యత కల్పిస్తూ గట్టి పోటీనిస్తున్న దినపత్రికల ధాటికి దాడికీ ఎదురొడ్డి జిల్లాలోనే నెంబర్ 1 పత్రికగా జిల్లావాసుల మనసులను దోచుకున్న ప్రియపుత్రిక మా(మీ) 'లాయర్' వారపత్రిక.

దృఢమైన ధైర్యంతో మొక్కవోని దీక్షతో 34వ పడిలో అడుగుపెట్టాం. ఇదే అండదండలతో ఇంతే ఆదరణతో, అదే ఆత్మవిశ్వాసంతో విజయ ప్రస్థానాన్ని కొనసాగిస్తామని ఈ 33వ పుట్టినరోజు సందర్భంగా 'లాయర్' ఆప్తులు, ఆత్మీయులు, ఆత్మబంధువుల సాక్షిగా ప్రతిజ్ఞ చేస్తున్నాం. ఇన్నాళ్ళు ఆదరించినవారికీ, ఆదరిస్తున్న వారికీ, తమ విలువైన ఆశీస్సుల ద్వారా ముందుకు నడిపిస్తున్న ప్రియ పాఠకులకీ, ప్రకటనకర్తలకీ, అందరికీ మా వినమ్రపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాం.

తుంగా శివప్రభాత్‌రెడ్డి

- సం/-

## ప్రమాణంతో ప్రయాణం



- గుంటూరు వద్ద ప్రమాణస్వీకారోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

**భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 67ఏళ్ల తర్వాత కూడా రాజధాని అంటూలేని రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఈ నెల 8న నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. ఈనెల 4వతేదీన తిరుపతిలో జరిగిన టీడీఎల్పీ సమావేశంలో తెలుగుదేశంపార్టీ ఎమ్మెల్యేలు చంద్రబాబును తమ నేతగా ఎన్నుకోవడం జరిగింది. ఈమేరకు 8వ తేదీ గుంటూరు వద్ద నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా వున్న విశాలప్రాంగణంలో భారీఎత్తున ఏర్పాటు చేస్తున్న కార్యక్రమంలో చంద్రబాబు ప్రమాణస్వీకారోత్సవం జరుగుతుంది.**

తిరుపతిలో టీడీఎల్పీ సమావేశం... గుంటూరులో ప్రమాణస్వీకారం... ఈతరం వారికి ఇవి కొత్తగా అనిపిస్తున్నాయి. ఎందుకంటే ఈతరం వారికి తెలిసిన రాజకీయ రాజధాని హైదరాబాద్ మాత్రమే. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా లెజిస్లేటివ్ సమావేశాలైనా, ప్రమాణస్వీకారోత్సవాలైనా అక్కడే జరిగేవి. కాని ఈతరంలో తొలిసారిగా హైదరాబాద్ వెలుపల ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీనినిబట్టే మన మనసులకు హైదరాబాద్ దూరమైందనే విషయం అర్థమైపోతుంది. (మిగతా 10వ పేజీలో)

## ప్రగతి రథం... ఇక పరుగులెత్తాలి!

(వివరాలు 10వ పేజీలో)

## డిప్యూటీ సీఎంగా నారాయణ?



చాలామంది మహానుభావుల గురించి మనం చదువుకుంటాం. వారు కష్టపడి ఎదిగింది పుస్తకాలలో, పేపర్లలో చదివి తెలుసుకుంటాం. అంతే కాని వారు ఉన్నతస్థాయిలోకి రావడానికి అంతుకుముందు ఎంత కష్టపడ్డారనేది మనం ప్రత్యక్షంగా చూడం. భారత ప్రధాని నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రి అయినప్పటి నుండే ఈ లోకానికి తెలుసు. అంతకుముందు ఆయన రైల్వేక్యాంటీన్‌లో టీ అమ్మింది, ఆరెస్సెస్ కార్యాలయంలో పనిచేసినదంతా కూడా పత్రికలలో చదివి తెలుసుకున్నాం. కాని నెల్లూరుజిల్లా వాసులు మాత్రం ఓ వ్యక్తి కష్టాన్ని, అతని ఎదుగుతూ ఉన్నతస్థానంలో నిలిచిన పరిణామక్రమాన్ని ప్రత్యక్షంగా చూసారు. 'కష్టేఫలి' అన్న పదానికి ఆదర్శంగా నిలిచిన ఆయన ఎదుగుదలను చూసి హర్షిస్తున్నారు. ఆయనే మన (మిగతా 5వ పేజీలో)

## యూపీగా మారుతున్న ఏపి
### అప్పడే కులం కంపు

**రాజకీయాల్లో సిద్ధాంతాల మధ్య పోరాటం ఉంటుంది. జెండాలు, అజెండాల మధ్య పోరు నడుస్తుంది. ఎన్నికలంటే రాజకీయవ్యవస్థల మధ్య నడిచే పోటీయే కాని వ్యక్తుల మధ్య నడిచే పోటీ కాదు. మరీ ముఖ్యంగా కులాలు, మతాల మధ్య జరిగే పోటీ కాదు.**

దురదృష్టమేంటంటే ఇప్పుడు దేశంలో కుల, మత పర రాజకీయాలే ఎక్కువవుతున్నాయి. భారతీయ జనతాపార్టీ ఈరోజు దేశంలో సంపూర్ణ మెజార్టీతో అధికారంలోకి వచ్చిందంటే అది కేవలం ఒక కులం వారో, ఒక మతం వారో ఓట్లు వేయడం వల్ల కాదు. కులమతాలకతీతంగా అందరూ ఓట్లేయడం వల్లే. నరేంద్రమోదీ నాయకత్వం పట్ల ఉన్న నమ్మకం వల్లే. హిందువుల ఓట్ల వల్లే బీజేపీ అధికారంలోకి వచ్చే పనయితే ప్రతి ఎన్నికలలోనూ బీజేపీయే గెలవాలి కదా! ఏ కులం వారికైనా, ఏ మతం వారికైనా కావాల్సింది సమర్థవంతమైన నాయకత్వం. తమకు భద్రత, భవిష్యత్ కల్పించే ప్రభుత్వం.

కాని కొన్ని రాష్ట్రాలలో ఇది కొరవడుతుంది. కులాల వారీగా రాజకీయాలు నడుస్తున్నాయి. ఇప్పటికే ఉత్తరప్రదేశ్, బీహార్, కర్నాటక వంటి రాష్ట్రాల్లో కులకంపు రాజకీయం ఎక్కువుగా వుంది. ఇటీవల ఈ జాడ్యం (మిగతా 10వ పేజీలో)



# ఓడినా వీడనంటున్న ఆదాల!



రాజకీయాలలో చాలామందికి ఐరన్‌లెగ్ శాస్త్రిలనే పేరుంది. వారి పేర్లు అప్రస్తుతం. కాని మాజీఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మాత్రం గోల్డెన్‌లెగ్ అనే పేరుంది. ఆయన ఏ పార్టీలో చేరితే ఆ పార్టీ అధికారంలోకి వస్తుందనే ప్రచారం వుంది. ఆదాల రాజకీయ చరిత్రలో అన్నీ అలానే జరిగాయి. 1999లో ఆయన రాజకీయాలలోకి ప్రవేశించాడు. ఆ ఎన్నికల్లో అల్లూరు నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసాడు. ఆయన గెలిచాడు. ఆయనతోపాటు తెలుగుదేశం గెలిచి అధికారాన్ని నిలబెట్టుకుంది. పార్టీలో అంతర్గత వర్గవిభేదాల మూలంగా 2004లో ఆయన వై.యస్.రాజశేఖరరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆ ఎన్నికల్లో సర్వేపల్లి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసాడు. ఆయన గెలిచాడు. కాంగ్రెస్‌పార్టీ కూడా అధికారంలోకి వచ్చింది. 2009లోనూ ఆదాల సర్వేపల్లి కాంగ్రెస్ అభ్యర్థిగానే పోటీ చేసాడు. ఆయన గెలిచాడు. కాంగ్రెస్ కూడా అధికారాన్ని నిలబెట్టుకుంది.


2014లో మళ్ళీ ఎన్నికలొచ్చాయి. రాష్ట్ర రాజకీయ పరిస్థితులు మారాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ కొట్టుకుపోయింది. ఎన్నికలకు ముందు సీమాంధ్రలో జగన్ గాలి బలంగా కనిపించింది. ఆ సమయంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలుగుదేశంలో చేరాలని నిర్ణయించుకున్నారు. ఆయన నిర్ణయాన్ని చాలామంది ఎగతాళిచేసారు. జగన్ గాలి ఇంత జోరుగా వుంటే ఆయన వెళ్ళి ఓడిపోయే తెలుగుదేశంలో చేరుతున్నాడన్నారు. ఈ ఎన్నికలతో గోల్డెన్ లెగ్‌గా వున్న ఆదాలకు ఐరన్‌లెగ్ అనే పేరొస్తుందని భావించారు. ఎన్నికలు ముగిసాయి. ఆయన లెగ్ లెక్క మాత్రం తప్పలేదు. తొలి ఓటమిని ఆయన ఎదుర్కొన్నా, ఆయన కాలుపెట్టిన తెలుగుదేశం పార్టీ మాత్రం అధికారంలోకి వచ్చింది. ఆదాల లెగ్ సెంటిమెంట్ మరోసారి ఫలించింది.

నెల్లూరు పార్లమెంట్‌లో ఆదాల ఓటమి అసలు లెక్కేలేదు. అభ్యర్థుల విషయంలో పార్టీ అధిష్టానం సరైన నిర్ణయం తీసుకునివుంటే ఆదాల గెలుపు నల్లేరు మీద నడకలా వుండేది. రెండేళ్ల క్రితం జరిగిన ఉపఎన్నికల్లో వైకాపా అభ్యర్థిగా మేకపాటి 2లక్షల 97వేల మెజార్టీతో గెలిచాడు. అదే మేకపాటి మొన్న చచ్చీచెడి 13వేల ఓట్ల మెజార్టీ తెచ్చుకున్నాడు. లోక్‌సభ పరిధిలో దాదాపు 75వేల క్రాస్ ఓటింగ్ జరిగింది. మేకపాటి వ్యతిరేకత, ఆదాల సానుకూలత ఆధారంగా ఇంత క్రాస్ ఓటింగ్ జరిగింది. అయితే ఇప్పుడు మేకపాటికి, ఆదాలకు పెద్ద తేడా వుండదు. మేకపాటి పార్లమెంటు హాల్‌లోకి పోగలడు. ఆదాల పోలేడంతే. మిగతా వాటిల్లో పోలిస్తే ఆదాల పరోక్ష ఎంపీగా చెలాయించే అవకాశం వుంది. ఇక నెల్లూరు లోక్‌సభ ఇన్‌ఛార్జ్‌గా ఆయన వ్యవహరించబోతున్నారు. కేంద్రంలో ఎన్డీఏ, రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వాలున్నాయి. ఎంపీగా మేకపాటి కంటే లోక్‌సభ ఇన్‌ఛార్జ్‌గా ఆదాలే ఎక్కువ పనులు సాధించే అవకాశాలున్నాయి.

# మేకపాటిపై తిరుగుబాటు






ఇంతకాలం సీట్ల కోసమో, ఎన్నికల కోసమో గాని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో మేకపాటి ఆధిపత్య పోకడలను భరిస్తూ వచ్చిన వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకులు ఒక్కసారిగా వారిపై తిరగబడుతున్నారు. జిల్లాలో ఇంతవరకు మీరు వెలగబెట్టిన నిర్వాకం చాలు... ఇక ఆపండంటూ బహిరంగంగానే పత్రికలకు ఎక్కుతున్నారు. మేకపాటి పోకడల వల్లే తాను ఓడిపోయానని ఓడిపోయిన ఒక నాయకుడైతే బహిరంగంగానే తన బాధను వెళ్లగక్కాడు.

కాంగ్రెస్‌ను వదిలి తాను బయటకు వచ్చేటప్పుడు తనతో పాటూ కలిసి వచ్చారనే కృతజ్ఞతతో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో మేకపాటి కుటుంబానికి పెద్దపీట వేసాడు జగన్. పార్టీలో తన తర్వాత రెండోస్థానం మేకపాటి రాజమోహన్‌రెడ్డిదే అన్నంత ప్రాధాన్యత కల్పించాడు. జగన్ ఇచ్చిన ఈ అవకాశంతో జిల్లాలో అందరు నాయకులను కలుపుకుపోవాల్సిన మేకపాటి, అందుకు భిన్నంగా వ్యవహరించారు. జిల్లాలో వర్గ రాజకీయాలకు తెరలేపారు. చేతయ్యి చేతగాని రాజకీయాలతో పార్టీలోని అందరు నాయకులతో పగ పెంచుకున్నారు. కాకాణి, కోటంరెడ్డి, అనిల్, రామిరెడ్డి ప్రతాప్, కొమ్మి, పాశం సునీల్... ఇలా అందరినీ దూరం చేసుకున్నారు. ఎన్నికలకు ముందువరకు కూడా వీరికి మేకపాటి మీద పీకల దాకా కోపం ఉన్నా బయటపడలేదు. ఎన్నికలు ముగిసేవరకు సర్దుకుపోయారు.

ఎన్నికలు ముగియడంతో ఒక్కొక్కరుగా మేకపాటిపై దండయాత్ర మొదలుపెట్టారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ ఎన్నికల ముందు నుండి కూడా మేకపాటితో రాజీపడలేదు. ఈరోజుకీ అదే పంథాలో ఉన్నాడు. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎన్నికల దాకా సహనంతో సర్దుకుని వచ్చాడు. ఎన్నికల తర్వాత వారిపై అగ్నిపర్వతంలా పేలిపోయాడు. ఇటీవల ఇడుపులపాయలో తనపై పెత్తనం చెలాయించాలని చూసిన మేకపాటి గౌతం ను జగన్ ముందే దులిపి పడేసాడు. కోవూరు నుండి ఓడిపోయిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తన ఓటమికి ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డే కారణమంటూ బహిరంగంగానే ధ్వజమెత్తాడు. అవతల తెలుగుదేశం ఎంపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులకు ఆర్థికంగా ఆసరాగా నిలిచాడు. మేకపాటి మాత్రం ఎమ్మెల్యే అభ్యర్థులకు ఇస్తానన్న డబ్బులు ఇవ్వలేదు. కొందరు అభ్యర్థులకైతే వారి అకౌంట్లలో డబ్బు వేయడంతో వాళ్లు డ్రా చేయలేక అప్పులు తెచ్చుకుని ఖర్చు చేసుకున్నారు. మేకపాటి సరిగా డబ్బు ఇవ్వకపోవడంవల్లే కోవూరులో ఓడిపోయాననే బాధలో ప్రసన్న ఉన్నాడు. అలాగే డబ్బు ఖర్చుపెట్టకపోవడం వల్లే ఉదయగిరిలో ఓటమి పాలు కావాల్సి వచ్చిందని అక్కడ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేకపాటి ఒంటెత్తు పోకడల వల్ల మెట్టుకూరు చిరంజీవిరెడ్డి లాంటి జనబలం కలిగిన నాయకులు దూరమయ్యారని, కాబట్టే ఇక్కడ పార్టీ ఓటమి చెందిందని భావిస్తున్నారు. వెంకటగిరిలో తన ఓటమికి కూడా మేకపాటి వర్గమే కారణమని కొమ్మి లక్ష్మయ్యనాయుడు భావిస్తున్నారు. మేకపాటి అనుచరవర్గం ఇక్కడ కొమ్మి ఓటమికి కంకణం కట్టుకుని పనిచేసింది. ఇక గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే సంజీవయ్యలు కూడా మేకపాటి ఆధిపత్య ధోరణులపై అసంతృప్తితోనే ఉన్నట్లు తెలుస్తుంది.

జిల్లా వైకాపా అంతా ఒక వైపుంటే, మేకపాటి కుటుంబం మాత్రమే ఇంకో వైపున్నట్లుగా పరిస్థితులు మారుతున్నాయి.

# తొలిప్రయత్నంలోనే విజయం



***కలలు కనాలి... వాటిని నెరవేర్చుకోవాలి. అప్పుడే మానవజన్మ సార్ధకత. మనం ఇంట్లో కూర్చుంటే ఏదీ మన వద్దకు రాదు. మనమే వాటి వద్దకు పోవాలి. వాటి కోసం కష్టపడాలి. ఈ కోణంలో తాను అనుకున్నది సాధించుకున్న నాయకుడే సర్వేపల్లి శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి.***

అసెంబ్లీకి తొలిసారిగా పోటీ చేసాడు. తొలి ప్రయత్నంలోనే విజయం సాధించాడు. 2006లో నెల్లూరుజిల్లా పరిషత్ ఎన్నికల్లో కాలు మోపేంత వరకు కూడా తాను ప్రత్యక్ష రాజకీయాలలోకి వస్తానని, తాను భవిష్యత్‌లో ఎమ్మెల్యేనవుతానని కూడా ఆయన అనుకోలేదు. అనూహ్యంగా ఏర్పడిన రాజకీయ పరిస్థితులే ఆయనను ప్రత్యక్ష రాజకీయ తెరపైకి తెచ్చాయి.

పొదలకూరు సమితి మాజీ అధ్యక్షుడు కాకాణి రమణారెడ్డి అందరికీ సుపరిచితుడే. ఆయన కొడుకు కాకాణి గోవర్ధన్‌రెడ్డి 2006 సంవత్సరం వరకు ఆనం రామనారాయణరెడ్డి ముఖ్యఅనుచరుడిగా తెరవెనుక రాజకీయాలకే పరిమితమయ్యారు. 2006లో జిల్లా పరిషత్ ఎన్నికలు జరిగాయి. మొదట నేదురుమల్లి వర్గం నుండి జిల్లా పరిషత్ ఛైర్మెన్ అభ్యర్థిగా ఆదాల రాఘవరెడ్డి పేరు వచ్చింది. అయితే జిల్లాలోని ఓటర్ల జాబితాలో ఆయన పేరు లేకపోవడంతో ఆయన వెనక్కిపోవాల్సి వచ్చింది. అప్పుడే ఆనం సోదరులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేరును తెరమీదకు తెచ్చారు. జిల్లా పరిషత్ ఛైర్మెన్‌గా ఆయన ఎన్నిక నల్లేరు మీద నడకే అయ్యింది. సైదాపురం జడ్పీటీసీ నుండి ఏకగ్రీవంగా ఎన్నికైన ఆయన జడ్పీ ఛైర్మెన్ పదవిని సునాయాసంగానే చేపట్టారు. జడ్పీ ఛైర్మెన్‌గా తన పనితీరుతో ఎంతో కీర్తిని సంపాదించారు. జడ్పీ ఛైర్మెన్‌గా ఉంటూనే ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా కూడా వ్యవహరించారు. ఇక్కడ పార్టీని బలోపేతం చేసారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఆత్మకూరు నుండి పోటీ చేయాలని అన్నీ సిద్ధం చేసుకున్నారు. అయితే తీరా ఎన్నికలొచ్చేసరికి ఈక్వేషన్ మారింది. నియోజకవర్గాల పునర్విభజనలో రాపూరు ఎగిరిపోవడంతో ఆనం రామనారాయణరెడ్డికి సీటు లేకుండా పోయింది. సర్వేపల్లి సీటును సిటింగ్ ఎమ్మెల్యేగా ఆదాలకే ఇవ్వాల్సి రావడంతో ఆనంకు ఆత్మకూరు తప్పలేదు. దీంతో ఆత్మకూరుపై కాకాణి పెట్టుకున్న ఆశలన్నీ నీరుగారిపోయాయి. తనను నమ్మించి ద్రోహం చేసారంటూ ఆయన ఆనం సోదరులకు వ్యతిరేకమయ్యాడు. వై.యస్. మరణానంతరం జగన్ పక్షాన నిలిచాడు. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి జిల్లా తొలికన్వీనర్‌గా పనిచేసి పార్టీ పురోభివృద్ధికి పాటుపడ్డాడు. సర్వేపల్లి నియోజకవర్గానికి సమన్వయకర్తగా ఉంటూ దీవెనయాత్ర పేరుతో గ్రామ గ్రామం తిరిగాడు. పార్టీ బలంతో పాటూ తన బలాన్ని కూడా పెంచుకున్నాడు. కాకాణి వ్యక్తిగత పరపతి చూసే రాష్ట్రంలో జగన్ తర్వాత వైకాపా గెలిచే రెండో సీటుగా సర్వేపల్లిని లెక్కేసుకున్నారు. కాకాణికున్న ఆదరణ చూసి ఇక్కడ ఆయనకు భారీగా మెజార్టీ వస్తుందని కూడా భావించారు. అయితే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి లాంటి బలమైన ప్రత్యర్థి మొదట ఇక్కడ నుండి పోటీ చేయడానికి వెనుకంజ వేసినా చివరకు అక్కడే నిలబడ్డాడు. చివరి నిమిషంలో దిగినా కాకాణికి గట్టిపోటీ ఇచ్చాడు. ఎంతైనా రాజకీయ అనుభవజ్ఞుడు కదా... కాకాణికి ముచ్చెమటలు పట్టించాడు. ఒక దశలో అయితే సోమిరెడ్డి గెలుస్తాడనే ప్రచారం జోరందుకుంది. భారీమెజార్టీలు తలక్రిందులై కాకాణి కొద్దిపాటి మెజార్టీతోనైనా బయటపడ్డాడు. ఏదేమైనా 2009లో ఎమ్మెల్యే కావాలనుకున్న ఆయన కల ఐదేళ్లు ఆలస్యంగానైనా నెరవేరింది.

# అమాత్య యోగం ఉందా?





జిల్లాలో తెలుగుదేశంపార్టీ ఓడిపోయింది. రాష్ట్రంలో మాత్రం గెలిచింది. ఆ పార్టీ ఏర్పాటు చేయబోయే ప్రభుత్వంలో జిల్లాకు కనీసం ఒక మంత్రి పదవైనా దక్కుతుంది. కాని ఇప్పుడు జిల్లాలో పది అసెంబ్లీలకు గాను మూడింటిలో మాత్రమే తెలుగుదేశం ఎమ్మెల్యేలున్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పరసారత్నం, బీద మస్తాన్‌రావు వంటి సీనియర్లు ఓడిపోయారు. గెలిచిన ముగ్గురు కూడా ఎన్నికలకు ముందు మంత్రి పదవిని గురించి ఆలోచించినవాళ్లు కాదు. కాని ఇప్పుడు అవకాశం వచ్చేసరికి ముగ్గురూ ఎవరి ప్రయత్నాల్లో వాళ్లున్నారు.

సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఓడిపోయినా ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రివర్గంలోకి తీసుకుంటారనే ప్రచారం వుంది. ఆ దిశగా తీసుకుంటే పార్టీలో ఇంకొందరికి కూడా అలాగే ఇవ్వాల్సి ఉంటుందని, అందరికీ ఎమ్మెల్సీలు ఎక్కడనుండి వస్తాయనే వాదన కూడా ఉంది. కాబట్టి గెలిచిన ఎమ్మెల్యేలలోనే పరిగణనలోకి తీసుకుంటే పార్టీ పరంగా గెలిచినవారిలో కురుగొండ్ల రామకృష్ణే సీనియర్. వెంకటగిరి నుండి వరుసగా రెండుసార్లు గెలిచాడు. సీనియార్టీ తీసుకుంటే ఆయనకే ప్రాధాన్యత ఇవ్వాలి. కాని ఇక్కడ సామాజిక సమీకరణ అడ్డొస్తుంది. తెలుగుదేశం ఎమ్మెల్యేలలో రెడ్లు తక్కువుగా వున్నారు. కడప, కర్నూలు, నెల్లూరుజిల్లాల్లో మాత్రమే మంత్రులుగా రెడ్లకు అవకాశముంది. అదీగాక జిల్లాలో పార్టీని పటిష్టపరచుకోవాల్సివుంది. కాబట్టి రెడ్డి సామాజికవర్గానికి ప్రాధాన్యతనివ్వాలి. ఆ కోణంలో చూస్తే ఆ వర్గం నుండి కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాత్రమే వున్నారు. కాకపోతే ఈయన మొన్ననే కాంగ్రెస్‌ను వీడి తెలుగుదేశంలో చేరాడు. పోలంరెడ్డి మొదటి నుండి తెలుగుదేశం మనిషే. 2004లో పార్టీ టిక్కెట్ రాకపోవడంతో కాంగ్రెస్‌లో చేరాడు. ఆ ఎన్నికల్లో కోవూరు నుండి సంచలన విజయం సాధించాడు. ఆ తర్వాత 2009లోనూ 2012 ఉపఎన్నికలలోనూ కాంగ్రెస్ అభ్యర్థిగా ఓడిపోయాడు. విభజనతో ఆ పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడంతో చంద్రబాబు ఆహ్వానం మేరకు మళ్లీ తెలుగుదేశంలో చేరాడు. గెలుపు ఖాయమనుకున్న ప్రసన్నను మట్టికరిపించాడు. పోలంరెడ్డికి ఆదాల వంటి నాయకుల మద్దతు కూడా వుంది.

వీరిద్దరితో పోలిస్తే ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని రామారావుకు అవకాశాలు తక్కువ. సామాజికవర్గం, సీనియార్టీ తీసుకుంటే కురుగొండ్ల ముందువరుసలో ఉంటాడు. కాకపోతే మెట్టప్రాంతాన్ని దృష్టిలో పెట్టుకుంటే ఆయనకు అవకాశం వుంది. మొత్తానికి ఊహించని విధంగా సీనియర్లు ఓడిపోవడం, కేవలం ముగ్గురు ఎమ్మెల్యేలే గెలవడంతో మంత్రి పదవి ఎవరిని వరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. నారాయణ విద్యాసంస్థల అధినేత పి.నారాయణకు డిప్యూటీ సీఎం ఇస్తే ఇప్పట్లో జిల్లాకు మంత్రి పదవి అనుమానమే!

లాయర్
వారపత్రికకు
33వ వార్షికోత్సవ శుభాకాంక్షలతో...



**K.V. RATNAM**
Founder & Chairman
'EDUCATIONALIST'

**Schools**
- Residential & Day-Schools

**Professional Colleges**
- B-Pharma
- M-Pharma
- Pharma D

**K. VENUGOPAL**
Managing Director

**Dr. K. KRISHNAKISHORE** M.S. ortho
Academic Director

# RATNAM
## GROUP OF EDUCATIONAL INSTITUTIONS

శీలేన శోభతే విద్య

NELLORE (Dist) CHITTOR(Dist)




## మాటతప్పని... మడమతిప్పని బాబు

తెలుగుదేశం అధినేత, సీమాంధ్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాటతప్పని మడమ తిప్పని నాయకుడు. తన తొమ్మిదేళ్ళ పాలనలో రాష్ట్ర ఉద్యోగులకు, పింఛన్‌దార్లకు 5విడతల కరువు భత్యం ఇవ్వలేదు. అవసరమైతే ప్రతి పక్షంలో కూర్చుంటానని కరువు భత్యం ఇవ్వనుగాక ఇవ్వను అన్నారు. మాట ప్రకారం కరవుభత్యం ఇవ్వ లేదు. ప్రతిపక్షంలో కూర్చున్న సంగతి అందరికీ తెలిసిందే. ఇప్పుడు రైతు లకు ఋణమాఫీ చేస్తానని, తాను ముఖ్యమంత్రి అయితే రైతుల రుణ మాఫీ ఫైల్ మీదే తొలిసంతకం అని, ఎన్నికల ప్రచారంలో రైతులకు వాగ్దానం చేశారు. బాబు ముఖ్య మంత్రి పగ్గాలు చేపట్టగానే మాఫీ చేయాలి రైతుల రుణం. లేకుంటే రైతుల పరిస్థితి దారుణం!

కురుగూరు రంగనాథం,
నెల్లూరు.

## ఇబ్బందులు కలిగిస్తున్న డివైడర్

స్థానిక కో-ఆపరేటివ్ కాలనీలో గల డివైడరు వల్ల ఇబ్బందిగా వుంది. వాహనాలు టర్నింగ్ తిరిగేందుకు ఇబ్బందిగా వుంది. అంతేకాకుండా ఈ డివైడర్ మీద రాత్రిళ్ళు స్త్రీలు చాలా పొద్దుపోయేదాకా కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఇందువల్ల కూడా అనేక ఇబ్బందులు వస్తాయి. కనుక అధికారులు ఈ డివైడర్ మీద తగు చర్య వెంటనే తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఏ.సాయి, కావలి.

## నల్లధనంపై... పోరాటం ఫలించాలి

నల్లధనం వెలికితీతకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న ప్రయత్నాలు ఫలించాలి. ఆయన ప్రయత్నాలకు దేశ ప్రజలందరి ఆశీస్సులున్నాయి. విదేశాల్లో మూలుగుతున్న మన నల్లధనాన్ని వెలికి తేగలిగితే నరేంద్ర మోడీ చరిత్రలో నిలిచిపోతారు. ఆయనను చూసి కాంగ్రెస్ వాళ్ళు బుద్ధి తెచ్చుకుంటారు. ఆ నల్లధనాన్నంతా భారత్‌కు రప్పిస్తే మన దేశమే ప్రపంచ బ్యాంకుకు అప్పు ఇచ్చే స్థాయికి చేరుకుంటుంది.

సి.రాజీవి, నెల్లూరు.

## 'ప్రభా'తం

### ఒట్టి చేతుల్తో ఒంటరి పయనం



రాష్ట్రాన్ని ఇప్పుడు వినూత్నంగా పునర్నిర్మించుకోవాలి. రాజధాని ఎక్కడ నిర్మించుకోవాలో ఇదమిద్ధంగా తెలియకుండా వున్న దయనీయ స్థితి నుంచి బయటపడి, రెట్టింపు ఉత్సాహంతో ఘనమైన, దివ్యమైన నవ్యాంధ్రప్రదేశ్‌ను అందరం కలసికట్టుగా సాధించుకోవాలి.

ఫర్వాలేదు..ఒట్టి చేతులతోనే ప్రగతి దారులు నిర్మించుకుంటూ ముందుకు సాగడం సీమాంధ్రకు కొత్తేమీ కాదు. ఎన్నిసార్లు అన్యాయం జరిగినా, అన్నిసార్లూ గుండె నిబ్బరంతో ముందుకు సాగుతోన్న సీమ ఇది..సీమాంధ్ర ఇది. ధరణీమాతలా అన్ని కష్టాలనూ ఓర్చుకునే..అన్నపూర్ణ ఇది. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు కోస్తా, రాయలసీమ ప్రాంతాలు మద్రాసు రాష్ట్రంలో వుండేవి. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో వున్నప్పుడు, తెలుగు మాట్లాడేవారికి ప్రత్యేక రాష్ట్రం వుండాలని అప్పట్లో ప్రజలు ఉవ్వెత్తున ఉద్యమించారు. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగనిరతితో అలా ఆంధ్రరాష్ట్రం ఆవిర్భవించింది. ఆయన ఆమరణదీక్షతో.. ప్రాణత్యాగంతో 1953 అక్టోబరు 1 వ తేదిన ఆంధ్రరాష్ట్రం అవతరించింది. అప్పుడు కర్నూలు రాజధానిగా వుండేది. ఆ తర్వాత, భాషాప్రయుక్త రాష్ట్రాల పేరుతో, తెలంగాణ వారితో సహా తెలుగుభాష మాట్లాడేవారందరితో కలసి 1956 నవంబరు 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా అవతరించింది. ఇప్పుడు 2014 జూన్ 2 నుంచి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోవడంతో, అవశేషాంధ్రప్రదేశ్ మాత్రమే నిలిచింది. తెలంగాణతో కలిపి 23 జిల్లాలతో విశాలంగా వున్న రాష్ట్రం, ఇప్పుడు 13 జిల్లాల సీమాంధ్ర, 10 జిల్లాల తెలంగాణగా.. రెండుగా విడిపోయింది. సీమాంధ్ర ఇప్పుడు.. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా, చిత్తూరు, అనంతపురం, కర్నూలు, కడప, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో 13 జిల్లాల చిన్న రాష్ట్రంగా అవతరించింది. దేశంలోనే విస్తీర్ణంలో నాల్గవ పెద్ద రాష్ట్రంగా, జనాభా సంఖ్యలో అయిదవ పెద్ద రాష్ట్రంగా వున్న ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు రెండు చిన్ని రాష్ట్రాలుగా విడిపోయింది. దేశానికంతటికీ మార్గదర్శకంగా వున్న తొలి భాషాప్రయుక్త రాష్ట్రం..ఇప్పుడు చరిత్రపుటల్లో బేలగా మిగిలిపోయింది. దాదాపు ఆరు దశాబ్దాల తెలుగు ప్రజల ఆత్మీయతానుబంధం రెండు ముక్కలైన వేళ.. తెలుగువారి గుండెల్లో అంతా నిస్తేజం ఆవరించింది.. ఇదేమిటీ?.. ఇన్నాళ్ళ.. ఇన్నేళ్ళ అనుబంధం అంతా భ్రమేనా?..కేవలం కలగానే మిగిలేనా?... అనే బాధ తెలుగువారి గుండెల్లో సుళ్ళు తిరిగింది. ఒకే కుటుంబంగా.. అన్నదమ్ముల్లా ఇద్దరూ కలసి మెలసి, ఎంతో కష్టించి అభివృద్ధి చేసుకున్న హైదరాబాద్ నగరం.. రాజధాని నగరంగా తెలుగువారందరికీ ఎంతో ఉపయుక్తంగా వున్న వేళ... ఇప్పుడు ఇద్దరూ వేరు కావడం.. కలసికట్టుగా కట్టుకున్న ఇంటి నుంచి ఒకరు ఒంటరిగా ఒట్టిచేతులతో బయటకు రావాల్సివుండడం..భాగ్యనగరం భౌగోళికంగా తమకు దూరమైపోతోందేననే బాధ..ఆవేదన..ఇలా అన్ని వేదనలూ కలసి..సీమాంధ్ర ప్రజల హృదయాలు ముప్పిరిగొన్న ఆవేదనతో ఆర్ద్రమవుతున్నాయి. ఇన్నేళ్ళ ఒక ప్రస్థానం..మళ్లీ మొదటికొచ్చినట్లు అనుభూతి. వెంటనే ఏమిచేయాలో తెలియని స్థితి.. అనంతమైన నిరాశ ఒక్కసారిగా ఆవరించినట్లు...ఓ గాఢమైన నిట్టూర్పు!.. ఇదీ ప్రస్తుతం సీమంధ్ర పరిస్థితి. పరుగుపందెంలో పరుగెత్తి అలసినవాడు.. మళ్ళీ మొదటినుంచి పరుగెత్తేందుకు వెంటనే సిద్ధం కావాలంటే ఆ క్రీడాకారుడి మానసిక స్థితి ఎలా వుంటుందో..సరిగ్గా అలా వుందిప్పుడు సీమాంధ్ర స్థితి. అయినా.. తప్పదు. ఎప్పుడూ ఒకరి వెంట కాదు.. అవసరమైతే ఒంటరిగానైనా సరే పయనం సాగించాల్సి వచ్చినప్పుడు కూడా ధీరులైనవారెప్పుడూ వెరవరు.. వెనుతిరగరు.. సమస్యలకు భయపడి వెనుకంజవేస్తే భవిష్యత్తు మరింత అంధకారమవుతుంది. భావితరాలవారికి మనం ఏమని సమాధానం చెప్పుకోవాలి?.. అందుకే ఎన్ని సమస్యలున్నా సరే, ఎంత సాహసం చేయాల్సివచ్చినా సరే.. దేనికీ భయపడకుండా పునాదుల నుంచీ రాష్ట్రాన్ని ఇప్పుడు వినూత్నంగా పునర్నిర్మించుకోవాలి. రాజధాని కూడా లేకుండా, రాజధాని ఎక్కడ నిర్మించుకోవాలో ఇదమిద్ధంగా తెలియకుండా వున్న దయనీయ స్థితి నుంచి బయటపడి, రెట్టింపు ఉత్సాహంతో ప్రతి జిల్లాను ఒక మహానగరంలా తీర్చిదిద్దుకోవాలి. మునుపటి కంటే ఘనమైన, దివ్యమైన నవ్యాంధ్రప్రదేశ్‌ను అందరం కలసికట్టుగా సాధించుకోవాలి. భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలి. సీమాంధ్ర ప్రజల సత్తా ఏమిటో..ప్రగతి పరుగుపందెంలో నిరూపించుకోవాలి. మరో ప్రస్థానం సాగించి..అలుపెరుగని యోధునిగా అవిశ్రాంతంగా, అభివృద్దే ధ్యేయంగా కృషి చేయాలి. అసలే రాష్ట్రంలో వ్యవసాయం కుదేలైపోయింది. గిట్టుబాటు ధరలు లేక అన్నదాతల బాధ వర్ణనాతీతంగా వుంది. ఆర్థిక రంగం భారీ లోటుతో కునారిల్లుతోంది. విద్యుత్ రంగం అస్తవ్యస్తమైపోయింది. విద్యారంగం వెనుకబడిపోయింది. వైద్యరంగం నామమాత్రమైపోయింది. గ్రామాలు, పట్టణాల్లో మౌళిక సదుపాయాలు లేక, అనేక ప్రాంతాల్లో ప్రజలు కనీసం గుక్కెడు మంచినీటికి కూడా వెంపర్లాడుతున్నారు. అనేక ప్రాంతాల్లో మంచి రోడ్లూ లేవు.. మంచి వసతులూ లేవు. మరోవైపు ధరలు ఆకాశానికి పెరిగిపోయి సామాన్యుడి జీవితం బాధల సుడిగుండంలో పడి కొట్టుమిట్టాడుతోంది. ఉపాధి లేదు.. ఉద్యోగాలు లేవు.. నిరాశతో యువత అల్లాడుతోంది. దళితులు, గిరిజనులు.. బడుగు, బలహీన వర్గాల ప్రజల బాధలు చెప్పనలవికాకుండా వున్నాయి. అటు ఆర్థికంగా నిలదొక్కుకోలేక, ఇటు సామాజికంగా ఆశించిన రక్షణ లేక మహిళారంగం విలవిలలాడుతోంది. చేనేత తదితర వృత్తులు ఆర్థికంగా చితికిపోయి, వారి జీవితాలు కళాహీనంగా మారాయి. ఏ రంగం చూసినా ఆర్థికలేమితో అష్టకష్టాల్లో వుంది. అయినప్పటికీ, చీకటిలోనే చిరుజ్యోతులు వెలిగించుకుని, భావితరాలకు వెలుగు బాటలు చూపించడం అందరి కర్తవ్యం. అభివృద్ధిని ఆకాంక్షించే ఇద్దరు మహానేతలు.. ఒకరు దేశ ప్రధానిగా వున్న నరేంద్రమోడీ, మరొకరు ఈ నెల 8న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్న చంద్రబాబునాయుడుల నేతృత్వం సీమాంధ్రకు ఒక గొప్ప వరం. వారి సారధ్యంలో, కేంద్రమంత్రి, ప్రత్యేకించి ఈ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ జాతీయ నాయకుడు ముప్పవరపు వెంకయ్యానాయుడు సహకారంతో సీమాంధ్ర తిరిగి స్వర్ణాంధ్రగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## 'అంతర్'జాతీయం

- జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370పై తగిన సమయంలో స్పందిస్తామని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ పేర్కొన్నారు. ఈ అంశంపై కేంద్రం ఒక నిర్దిష్ట స్పందనతో వస్తుందన్నారు.
- యూపిఏ ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓఎం, ఈజీఓఎంలను ఎన్‌డిఏ ప్రభుత్వం రద్దు చేసింది. ఈ చర్యతో నిర్ణయాలు తీసుకునే ప్రక్రియ వేగవంతమవుతుందని, వ్యవస్థలో జవాబుదారీతనం పెరుగుతుందని ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.
- ఉమ్మడి పౌరస్మృతిని తాను గట్టిగా సమర్ధిస్తానని భారత ప్రెస్‌కౌన్సిల్ ఛైర్మెన్ జస్టిస్ మార్కండేయకట్జూ స్పష్టం చేసారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 ప్రకారం భారత భూభాగమంతా ఒకే పౌరస్మృతి ఉండేలా ప్రభుత్వాలు ప్రయత్నించాల్సి ఉందన్నారు.
- పొగాకు వినియోగానికి స్వస్తిపలికి ఆరోగ్యకర భారతదేశానికి పునాది వేయాలని భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆయన తన సందేశాన్ని ట్విట్టర్ ద్వారా వెల్లడించారు.
- ఐపిఎల్ స్పాట్ ఫిక్సింగ్ కుంభకోణం కేసులో అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం, అతని సహచరుడు ఛోటాషకీల్ ఆస్తులను జప్తు చేయాలని ఢిల్లీకోర్టు ఆదేశించింది. దీనికి సంబంధించిన నివేదికను తదుపరి విచారణ జరిగే ఆగస్టు 16 కల్లా సిద్ధం చేయాలని పోలీసులను కోరింది.
- అత్యాచార బాధితుల కోసం ప్రతిజిల్లాలో సహాయకేంద్రాలను ఏర్పాటు చేస్తామని కేంద్ర మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి మేనకాగాంధీ వెల్లడించారు. బాధితులకు వైద్యపరమైన, న్యాయపరమైన సహాయం అందజేస్తామన్నారు.
- బ్రిటన్‌కు చెందిన ప్రవాసభారతీయుడు సునీల్‌చోప్రా లండన్ బరో ఆఫ్ సౌత్‌వార్క్ మేయర్‌గా ఎన్నికయ్యారు. ఈ నెల 7న ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు.
- 1993 ముంబయి వరుసపేలుళ్ల కేసులో ఉరిశిక్షపడ్డ కీలక కుట్రదారుడు యాకుబ్‌అబ్దుల్‌రజాక్ మెమెన్‌కు ఉరిశిక్ష అమలుపై మే2వ తేదీ సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. మరణశిక్ష కేసుల్లో రివ్యూపిటిషన్లను న్యాయమూర్తుల ఛాంబర్‌లలో కాకుండా ఓపెన్ కోర్టులో వినాలంటూ మెమెన్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించింది.

## వార్త వ్యాఖ్య

వార్త :- రాజధానికి 2లక్షల కోట్లు.
– చంద్రబాబుతో సమావేశంలో అధికారుల అంచనా!
**వ్యాఖ్య :- *మిగిలిన రాష్ట్రాన్ని అమ్మినా ఇంత రాదేమో?***

వార్త :- అవసరమైతే ఆంధ్రకు రైల్వేజోన్. – రైల్వేమంత్రి సదానందగౌడ్.
**వ్యాఖ్య :- *అవసరమైతే ఏంటి... అవసరమే!***

వార్త :- కేసీఆర్ హుందాగా వ్యవహరించాలి. – మాజీ ఎంపీ కావూరి.
**వ్యాఖ్య :- *ముందు హుందా అంటే ఏంటో ఆయనకు తెలియాలిగా?***

వార్త :- కొద్దిరోజులు ఇంటి నుండే పాలన.
– సిద్ధంకాని కేసీఆర్ క్యాంపు కార్యాలయం.
**వ్యాఖ్య :- *ఇళ్లు అలవాటైతే ఇక మారడేమో?***

వార్త :- విద్యుత్‌లో ఆంధ్రకు అన్యాయం. – చంద్రబాబు.
**వ్యాఖ్య :- *మిగతావాటిలో ఏదో న్యాయం జరిగినట్లు?***

వార్త :- మిలిటెంట్ పోరాటాలకు బీసీలు సిద్ధంకావాలి. – ఆర్.కృష్ణయ్య.
**వ్యాఖ్య :- *మిలిటెంట్లే మానుకుంటుంటే కొత్తగా ఈ రెచ్చగొట్టడమేంటి?***

వార్త :- రిజర్వేషన్లు కల్పించాలి. – చంద్రబాబును కోరిన కాపు నేతలు.
**వ్యాఖ్య :- *ముందు ఆయన నెరవేర్చాల్సినవి చాలా ఉన్నాయిలేండి!***

వార్త :- 2022నాటికి అందరికీ ఇళ్లు.
– కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్యానాయుడు.
**వ్యాఖ్య :- *అప్పటిదాకా అద్దెఇళ్లలో ఉండాలంటారా?***

వార్త :- ప్రజలే మన బాస్‌లు. – మంత్రులకు కేసీఆర్ ఉద్బోధ.
**వ్యాఖ్య :- *బాస్ కంటే దొరలు అంటే సబబేమో!***

వార్త :- నవ్యాంధ్రప్రదేశ్‌కు మేమిచ్చిన హామీలు పూర్తి చేయండి.
– ప్రధానికి సోనియా లేఖ.
**వ్యాఖ్య :- *వాతలుపెట్టి బర్నాల్ పూయమన్నట్లుగా ఉంది.***

# డిప్యూటీ సీఎంగా నారాయణ?

(మొదటిపేజీ తరువాయి)

నెల్లూరీయుడు, నారాయణ విద్యాసంస్థల అధినేత పొంగూరు నారాయణ. చంద్రబాబుకు అత్యంత నమ్మకస్థుడిగా పేరుగాంచిన పి.నారాయణకు ఉపముఖ్యమంత్రి పదవి ఖరారైనట్లు సమాచారం.

మొన్న ఎన్నికల ప్రచారంలో కాపులకు ఒకటి, బి.సిలకు ఒకటి ఉపముఖ్యమంత్రి పదవులిస్తానని చంద్రబాబు చెప్పారు. ఈమేరకు బిసిల నుండి యనమల రామకృష్ణుడిని, కాపుల నుండి పి.నారాయణను తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. ఎక్కడా ఎన్నికల్లో పోటీ చేయలేదు, ఎక్కడా బహిరంగంగా ప్రచారం చేయలేదు, నారాయణకు ఉపముఖ్యమంత్రి పదవి ఎలా ఇస్తున్నారని చాలామంది అనుకోవచ్చు. ఆయన పోటీ చేసి వుంటే ఒక నియోజకవర్గానికే పరిమితమయ్యేవాడు. ఆయన ప్రచారం చేసివుంటే ఒకట్రెండు నియోజకవర్గాలను ప్రభావితం చేసేవాడు. కాని ఆయన ఎవరికీ అంతుచిక్కకుండా అండర్‌గ్రౌండ్ ఎలక్షన్‌వర్క్ చేసాడు. ఆయన పనితీరు మూడుజిల్లాల మీద ప్రభావం చూపింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల ఇన్‌ఛార్జ్ బాధ్యతలు ఆయనే నిర్వర్తించారు. ఇక్కడ మంచి ఫలితాలు తీసుకొచ్చారు. కాబట్టే ఆయనపై చంద్రబాబుకు నమ్మకం పెరిగింది. తనకు చోదోడు, వాదోడుగా ఉంటాడని ఉపముఖ్యమంత్రిని చేస్తున్నారు. నారాయణ వేసిన ప్రతి అడుగులోనూ శ్రమ వుంది. 30ఏళ్ల క్రితం నారాయణ కోచింగ్ సెంటర్ అనే చిన్న సంస్థ ద్వారా మొదలైన ఆయన ప్రయాణం ఈరోజు డిప్యూటీ సీఎం దాకా సాగింది. ఈ నెల్లూరీయుల కళ్ల ముందే నారాయణ కోచింగ్‌సెంటర్ పెట్టాడు. క్రమక్రమంగా విద్యాసంస్థలను పెంచాడు. దేశమంతటా వాటిని విస్తరింపజేసాడు. ఇప్పుడు మన కళ్ల ముందే డిప్యూటీ సీఎం అవుతున్నాడు. మన కళ్లముందే జీరోస్థాయి నుండి తొలిఅడుగును వేసి అన్ని రంగాల్లో హీరో స్థాయికి ఎదిగిన నారాయణ జీవితం ధన్యం.

## కొనసాగుతున్న క్యాంప్ యాత్రలు

మున్సిపల్, పంచాయితీరాజ్ ఎన్నికలు ముగిసి ఎన్నికలు విడుదలై నెల దాటుతున్నా ఇంతవరకు మేయర్లు, ఛైర్‌పర్సన్‌లు, జడ్పీ ఛైర్మెన్, ఎంపీపీల ఎన్నికకు నోటిఫికేషన్ రాకపోవడంతో సంబంధిత అభ్యర్థుల పరిస్థితి నరకప్రాయంగా వుంది. గెలిచిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ఎక్కడ అధికారపార్టీ వలలో పడతారోనని వైకాపా నాయకులు తమ వారిని వోల్వో బస్సుల్లో ఎక్కించి విహారయాత్రలకు తిప్పుతున్నారు. ఇప్పటికే షిరిడి, హైదరాబాద్, పూణె, ఊటీ, బెంగుళూరు, మైసూర్ వంటి ప్రాంతాలను వీళ్ళు చుట్టేసి తమ సమ్మర్ సెలవులను ఈ విధంగా కుటుంబసభ్యులతో ఎంజాయ్ చేసారు. అయినా ఇంతవరకు నోటిఫికేషన్ వెలువడకపోవడం, మేయర్, జడ్పీ ఛైర్మెన్‌ల ఎన్నికలకు ఇంకా పది రోజులకుపైగా సమయం పట్టే అవకాశం ఉండటంతో వీళ్ళందరికీ ఇళ్ళ మీద గాలిమళ్లి నెల్లూరు రావాలనుకుంటున్నట్లు తెలుస్తుంది.

## నూతన డిఎఫ్ఓగా రాంబాబు



జిల్లా అటవీ శాఖ అధికారి (డిఎఫ్ఓ) ఇన్‌ఛార్జ్‌గా పనిచేస్తున్న తిరుపతి డిఎఫ్ఓ శివరామప్రసాద్ రిలీవ్ అయ్యారు. ఆ స్థానంలో ఎస్.రాంబాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతో ఆయన మే 31న బాధ్యతలు స్వీకరించారు. డెహ్రాడూన్‌లో రెండు సంవత్సరాలు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) శిక్షణ పొంది అదిలాబాద్‌లో ఎనిమిది నెలలు పనిచేసి ప్రస్తుతం నెల్లూరు డిఎఫ్ఓగా వచ్చారు.


విజన్ ఉన్న డైరెక్టర్ సారధ్యంలో... ఫ్యూచర్ వైపు కదంతొక్కిన ఫ్యూచర్ విజన్ విద్యార్థులు...

మొదటి బ్యాచ్‌తోనే మాగుంట లే-అవుట్‌లో సంచలనాలు సృష్టించిన - డా॥ కిషోర్స్ రత్నం ఫ్యూచర్ విజన్ స్కూల్


K.V. RATNAM GARU
శీలేన శోభతే విద్య

The only School with SMART BOARD EDUCATION in Magunta Layout

ఇంటర్నేషనల్ విద్యావిధానం... స్పష్టమైన విద్యా ప్రణాళికలు విద్యావ్యవస్థ పునాదులను బలోపేతం చేస్తాయని రుజువైన సత్యం ఇది. ఇదే స్ఫూర్తితో రాబోయే విద్యా సం॥ నుండి మారుతున్న సిలబస్‌కు అనుగుణంగా ప్రోగ్రామ్స్ రూపొందించి పాఠ్యాంశం సారాంశాన్ని అవగాహన చేసుకొని సృజనాత్మకంగా ఆలోచించేలా విద్యార్థులను తీర్చిదిద్ది సంచలన ఫలితాలు సాధిస్తాం...

- డా॥ కె. కృష్ణకిషోర్, డైరెక్టర్

పరీక్షకు హాజరైన 17 మందితో సాధించిన అద్భుత విజయాలు


10
G.S.V. SATHWIK REDDY
H.T. No. 1417109155


10
SK. HASHMITHA MOHISIN
H.T. No. 1417107230


10
V. THANVI SREE NITHYA
H.T. No. 1417106810

అత్యుత్తమ G.P.A. తో 100% ఉత్తీర్ణత

2013 - 14 మొదటి బ్యాచ్‌తోనే అత్యుత్తమ G.P.A. సాధించిన ఫ్యూచర్ విజన్ స్కూల్ విద్యార్థులు

| SUB | A1 | A2 | TOTAL |
|---|---|---|---|
| Tel | 11 | 3 | 14 |
| Hin | 4 | 6 | 10 |
| Eng | 4 | 6 | 10 |
| Mat | 10 | 1 | 11 |
| Sci | 9 | 5 | 14 |
| Soc | 9 | 5 | 14 |

| G.P.A | Students |
|---|---|
| 10 | 3 |
| 9.8 & Above | 5 |
| 9.7 & Above | 10 |
| 9.0 & Above | 17 |

ఇంగ్లీష్ లో 59%
హిందీ లో 59%

తెలుగులో మొత్తం A గ్రేడుల శాతం 82%
సైన్స్‌లో మొత్తం A గ్రేడుల శాతం 82%
సోషల్‌లో మొత్తం A గ్రేడుల శాతం 82%
మ్యాథ్స్‌లో మొత్తం A గ్రేడుల శాతం 65%

ఫ్యూచర్ విజన్ ప్రత్యేకతలు :
- Play Class నుండి 5th Class వరకు International స్థాయి విద్యా బోధన
- 6 నుండి 10వ తరగతి వరకు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీపరీక్షలకు అనుగుణంగా విద్యా బోధన
- Play Class నుండి 6th Class వరకు Smart Board (Touch Screen) Technology తో శిక్షణ.
- సువిశాలమైన క్రీడా ప్రాంగణం
- Single Section... Limited Strength

Dr. Kishore`s Ratnam
Future Vision School
MAGUNTA LAY OUT, NELLORE

Play Calss to X Class | ADMISSIONS are in PROGRESS | For details contact : 9963014407, 9032080044






హార్దిక శుభాకాంక్షలు

పత్రికా భారతంలో 33ఏళ్ల ప్రస్థానం
పాఠకుల హృదయాల్లో శాశ్వతమైన స్థానం

లాయర్
తెలుగు వారపత్రికకు
33వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.



పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి
శాసనసభ్యులు, కోవూరు.



# ప్రజాసమస్యలపై స్పందించండి


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రేఖారాణి

ప్రజల దగ్గర నుండి పట్టాలు, రేషన్ కార్డులు, పింఛన్లు తదితర అవసరమైన వాటిపై వచ్చే అర్జీలు స్వీకరించి నమోదు చేసుకొని సీనియారిటీ జాబితా వారీగా మంజూరు చేసేందుకు సిద్ధంగా వుంచాలని సంయుక్త కలెక్టర్ శ్రీమతి జి.రేఖారాణి పేర్కొన్నారు.

సోమవారం నెల్లూరు గోల్డెన్‌జూబ్లీ హాలులో ప్రజావిజ్ఞప్తులు, ఆక్వాసాగు, ఇసుక అక్రమరవాణా, తదితర రెవెన్యూ కార్యక్రమాలపై మండల డిప్యూటీ తహశీల్దార్లతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రధానంగా ప్రజల నుండి వివిధ సమస్యలపై వచ్చే అర్జీలను వీలైనంత వరకు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ ప్రక్రియలో రెవెన్యూపరమైన అర్జీలు ఎక్కువుగా వస్తున్నాయని వీలైనంతవరకు మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే మండలస్థాయి, డివిజన్ స్థాయిలలో పరిష్కారం కాకుంటే జిల్లా కేంద్రానికి పలురకాల అర్జీలు వస్తున్నాయని, వీటిని పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో వచ్చిన అర్జీలను కంప్యూటర్‌లో స్కానింగ్ చేసి ఆన్‌లైన్ విధానం ద్వారా సంబంధిత శాఖాధికారులకు పంపి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వివిధ మండలాలలో అపరిష్కృత అర్జీలు పెండింగ్‌లో వున్నాయని, వాటిని సంబంధిత వీఆర్‌ఓ మరియు ఆర్‌ఐల సమన్వయంతో పరిష్కరించేలా చూడాలన్నారు. అనుమతి లేకుండా ఇష్టానుసారంగా ఆక్వాసాగు చేస్తున్న వాటిపై ప్రత్యేకదృష్టి పెట్టి పరిసర ప్రాంతాల వ్యవసాయానికి యోగ్యమైన భూములను సంరక్షించుకునేలా చూడాలన్నారు. ప్రధానంగా జిల్లాలో గుర్తింపు పొందిన ఇసుక రీచ్‌ల వద్ద కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలించే వారిని ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సీజ్ చేయాలన్నారు. అనుమతి లేకుండా జిల్లాలోవున్న ఇసుక రీచ్‌ల నుండి ఇసుక రవాణా జరిగినట్లు తమ దృష్టికివస్తే సంబంధిత వీఆర్‌ఓ మరియు సర్పంచ్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకుం టామన్నారు. కనుక ప్రతిరోజూ ఇసుక అక్రమ రవాణా వీఆర్‌ఓ సెక్రటరీ మరియు సర్పంచ్‌ల సమన్వయంతో సమీక్షించుకొని అక్రమ ఇసుక రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

తొలుత ప్రజల నుండి వచ్చిన అర్జీలు స్వీకరణ, పరిష్కారం మరియు పౌరసరఫరాల సక్రమ పంపిణీ విషయాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.వి.నాగేశ్వరరావు, మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ హరికిరణ్, వివిధ మండలాలకు చెందిన డిప్యూటి తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# రెండోపంటకు సక్రమంగా సాగునీరు


జాఫర్‌సాహెబ్ కెనాల్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

రైతులు వేసుకున్న రెండవ పంటకు సంబంధిత ఇరిగేషన్ కాలువల ద్వారా సక్రమంగా సాగునీరందించేందుకు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ పేర్కొన్నారు. 3వ తేదీ సాగునీటి కాలువలలో భాగంగా కాలువను అల్లీపురం, సౌత్ఆములూరు మరియు నారాయణరెడ్డిపేట ప్రాంతాలలో జాఫర్‌సాహెబ్ కెనాల్ సాగునీటి సరఫరా పరిస్థితులను పర్యవేక్షించి సంబంధిత రైతులతోను ఇరిగేషన్ అధికారులతో చర్చించి పలు సూచనలు, సలహాలిచ్చారు. పెన్నార్ డెల్టా క్రింద జాఫర్‌సాహెబ్ సాగునీటి కాలువ పరిధిలోని ఆయకట్టు భూములకు సాగునీటిని సక్రమంగా అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కాలువల కింద అక్రమంగా మోటార్లపై సాగునీటిని తీసుకొంటున్న వాటిని నిలుపుదల చేయాలన్నారు. కాలువ పొడవున వున్న గుర్రపుడెక్కను తొలగించేందుకు స్థానిక రైతుల సమన్వయంతో అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు చెల్లించాల్సిన పన్ను బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులు మరియు ఇరిగేషన్ అధికారుల సమన్వయంతో జాఫర్‌సాహెబ్ కాలువలోని గుర్రపుడెక్క మరియు చెత్తను తొలగించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఇ కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.కేశవరావు, అసిస్టెంట్ ఇంజనీరు వేణుగోపాల్, సంబంధిత రైతులు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రికి కన్నీటి నివాళి


గోపీనాథ్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గోపీనాథ్‌ముండే అకాలమరణం పట్ల బీజేపీ జిల్లా నాయకులు దిగ్భ్రాంతి చెందారు. ఈ నెల 3న ఆయన మరణవార్త తెలుసుకున్న వెంటనే నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటుచేసి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ 48సీట్లున్న మహారాష్ట్రలో బీజేపీ కూటమి 42సీట్లు సాధించడం వెనుక గోపీనాథ్‌ముండే విశేషకృషి ఉందన్నారు. మహారాష్ట్ర ఉపముఖ్య మంత్రిగా, ప్రతిపక్షనేతగా ఆయన సమర్థవంతంగా సేవలందించారని కొనియాడారు. రెండోసారి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికై నరేంద్రమోడీ కేబినెట్‌లో కీలకమైన గ్రామీణాభివృద్ధిశాఖను చేపట్టి వారం కూడా కాకముందే ఆయన మన నుండి దూరం కావడం అంతులేని విషాదకర పరిణామమన్నారు.

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి గోపీనాథ్‌ముండే జీవితంలో ఎలా ఎదిగింది వివరించి ఆయన జీవనశైలిని ప్రతి కార్యకర్త ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, నగర అధ్యక్షులు మండ్ల ఈశ్వరయ్య, నాయకులు యరబోలు రాజేష్, బండారు శ్రీనివాస్, మారుతీకుమార్‌రెడ్డి, కప్పిర శ్రీనివాసులు, మొగరాల సురేష్, ఎం.శ్రీనివాస్, మధు, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమగ్యాస్‌పై దాడులు


స్వాధీనం చేసుకున్న సిలిండర్లతో డిఎస్ఓ శాంతకుమారి

ఓపక్క గృహస్థులు గ్యాస్ సిలిండర్లు రాక ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క గ్యాస్ ఏజెన్సీల ద్వారా సిలిండర్లు మాత్రం పక్కదారి పడుతున్నాయి. హోటళ్ళు, రెస్టారెంట్లలో గృహ వినియోగదారుల సిలిండర్లను యధేచ్ఛగా వాడేస్తున్నారు. సోమవారం జిల్లా పౌరసరఫరాల శాఖాధికారులు నెల్లూరు నగరంలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి నగరంలోని పలు ప్రాంతాల్లో హోటళ్లను, రెస్టారెంట్లను, హాట్‌ఫుడ్స్ సెంటర్లను తనిఖీ చేసారు. అక్రమంగా వినియోగిస్తున్న 82సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉదయం 10గంటలకు మొదలుపెట్టి సాయంత్రం 4గంటల వరకు కూడా అధికారులు దాడులు నిర్వహించారు. పట్టుబడ్డ అక్రమ సిలిండర్లకు సంబంధించి వ్యాపారసంస్థల నిర్వాహకుల మీద పౌరసరఫరాల శాఖ 6(ఏ) కేసులు నమోదు చేసారు. జాయింట్ కలెక్టర్ కోర్టులో ఈ కేసులపై విచారణ జరుగనుంది. ఈ కేసుల్లో నిందితులకు జరిమానాతో పాటూ శిక్ష కూడా పడనుంది. ఈ దాడుల్లో డిఎస్ఓ శాంతకుమారి, ఏఎస్ఓలు లక్ష్మీనారాయణ, పుల్లయ్య, శ్రీహరి, పిఎస్‌డిటిలు లాజరత్, నిరంజన్, రవీంద్రబాబు, శివప్రసాద్‌లు పాల్గొన్నారు.


## సేవలు మితం...

# సభలు-సమావేశాలు-సత్కారాలకే పరిమితం

- కనిపించని చలివేంద్రాలు... పట్టించుకోని స్వచ్ఛంధసంస్థలు
- గుక్కెడు నీటికోసం జనం అవస్థలు




మండే ఎండల్లో కాస్తంత గుక్క తడుపుకుందామంటే గుక్కెడు మంచినీరు కూడా దొరకని దురవస్థ దాపురించింది. రూపాయిస్తే తప్ప ప్యాకెట్‌నీళ్ళు రావడం లేదు. గతంలో నెల్లూరులో అక్కడక్కడా చలివేంద్రాలు వుండేవి. రంగనాయకులపేట సెంటర్‌లోనూ, గాంధీబొమ్మ కూడలి వద్ద, వీఆర్‌సిసెంటర్ వద్దా..ఇలా అక్కడక్కడా పెద్దపెద్ద కుండల్లో చల్లటినీటిని ఉచితంగా ఇచ్చేవారు. ఎర్రటి ఎండలో చల్లటి నీళ్ళిచ్చి పుణ్యం కట్టుకునేవారు. ఇప్పుడా రోజులు పోయినట్లేనా అనిపిస్తుంది. ఇంకాస్త గతంలోకి వెళ్తే ఎండాకాలంలో చల్లని మజ్జిగను కూడా పాదచారులకు ఇచ్చే మంచి సంప్రదాయం నెల్లూరులో వుండేది. ఇప్పుడు మజ్జిగ సంగతి అటుంచితే లోటా మంచినీళ్లు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. గతంలో చిన్మయ మిషన్ వంటి సంస్థలు అక్కడక్కడా చలివేంద్రాలు పెట్టి ప్రజలకు చల్లటి నీరందించేది. నగరంలో ఎంతో కాలంగా ఎన్నో సేవాసంస్థలు వున్నాయి. లయన్స్ క్లబ్, రోటరీ, జేసీస్ వంటి మంచి ప్రఖ్యాతిగన్న సేవాసంస్థలు కూడా ప్రజలకు తమ వంతు సేవలందిస్తూనే వున్నాయి. అయితే, ఎండాకాలంలో ప్రజలు దాహార్తి తీర్చేందుకు నగరంలో అక్కడకక్కడా చలివేంద్రాలు కూడా ఏర్పాటు చేస్తే బావుండేది. ఇప్పుడా పరిస్థితే ఎక్కడా కనిపించడం లేదు. చలివేంద్రాలు వుంటే ఎంతో మంది పేదలు ఆ దారిన వెళ్తూ చల్లటి మంచినీరు తాగి సేదతీరేవారు. నగరంలో అనేక స్వచ్ఛంధ సంస్థలు వున్నప్పటికీ వాటిలో అధికశాతం సంస్థలు అలాంటి సేవలు తగ్గించుకుని, సభలు, సమావేశాలు, సన్మానాలు-సత్కారాలకే పరిమితమయ్యాయా అనిపిస్తోందని ప్రజల ఆవేదన. ప్రజలకు వచ్చిపడే అనేక కష్టనష్టాల్లో ఆదుకుని ఆదరహస్తం అందించడంలో సేవాసంస్థల పాత్ర ఎంతో కీలకంగా వుంటుంది. ఈతిబాధలతో ప్రజలు సతమతమవుతున్నప్పుడు, ప్రకృతి ప్రకోపించినప్పుడు ప్రజలను ఆదుకునేందుకు తామున్నామంటూ సేవాసంస్థలు తమ వంతు బాధ్యతగా భరోసా ఇచ్చేవి. చేతనైనంత సాయం అందించేవి. అలాంటి సేవాసంస్థలు కూడా ఈ మండుటెండల్లో ప్రజలను పట్టించుకోకపోతే మరికెవరు పట్టించుకుంటారు?..మీరే ఆలోచించండి!..అసలే ఎండలు మిడిమేళంగా వున్నాయి.దానికి తగ్గట్టు రంగనాయకుల పేటనుంచి ఈ మూల వేదాయపాళెం దాకా ఎక్కడైనా పాదచారులు కొంచెంసేపు నిలబడాలంటే, ఒక్క చెట్టయినా వుంటే కదా?.. ట్రంకురోడ్డు దగ్గరున్న ఒకటి రెండు చెట్లు తప్ప, అసలు చెట్టనీడే కనిపించడం లేదు. ఎంత నడిచినా ఎండ తరుముకుని వస్తుంటుందే తప్ప జనానికి నిలువ నీడలేని దుస్థితి. నగరం సుందరనందనవనం చేస్తామని నాయకులు చెప్పుకుంటూ కాలం గడిపేస్తుంటారు తప్ప, ఆచరణలో మాత్రం అంతా అఘోరింపే. రోడ్ల వెడల్పు పేరుతో, పదుగురికీ నీడనిస్తున్న మహావృక్షాలను కూడా కూల్చిపారేస్తే..ఇక పర్యావరణం కాపాడే దిక్కు ఎక్కడా?..బెంగుళూరు వంటి మహానగరాల్లో సైతం చెట్లకు ఇబ్బంది లేకుండా, రోడ్లు వెడల్పు చేయడం చూస్తుంటాం కానీ, ఇక్కడ ఇలా ఏకంగా..వున్న చెట్లన్నిటినీ సపాయిగా నరికేసుకుంటూ పోతుంటారు. మానవ మనుగడకు, పర్యావరణ పరిరక్షణకు చెట్లు ప్రాణప్రదమని తెలిసినప్పటికీ, చెట్లను నరకడమే తప్ప, నాటడం పట్టించుకోకపోతే ఎలా?..ఇది ఇలాగే కొనసాగుతూపోతే..భవిష్యత్తులో ఈ జనారణ్యంలో మనుషులకు నిలువ నీడ లేక, గుక్కెడు మంచినీరు ఇచ్చే దిక్కు లేక...పరిస్థితి మరింత ఘోరంగా తయారవుతుంది. కనుక, ఇప్పటికైనా జాగ్రత్త పడడం మంచిది.



# చట్టాలు వృథా...

# ఆగని గోవ(వ్య)ధ

**కనుమరుగవుతున్న మానవత్వం**
**లక్షల్లో గోమాంస విక్రయాలు**
**అధికారుల దాడులతో బెంబేలు**

*మనుషుల్లో మానవత్వం కనుమరుగైపోతోందా అనిపిస్తోంది. కరుణ, జాలి, దయ, మానవత్వం లోపిస్తే, మానవుడు దానవుడు కాక మరేమవుతాడు?..అందులోనూ ఎంతో పూజనీయమైన గోమాతలను వధించడం ఎంత దారుణం!..మూగజీవాలపై కనీసం కారుణ్యం చూపకపోగా, ఆ మూగజీవాలను చంపి, వాటి మాంసవిక్రయంతో తమ పొట్ట పోషించాలనుకోవడం ఎంత ఘోరం?..*

గోవులను ఆరాధ్యదైవంగా భావించే పవిత్రమైన సంస్కృతి మనది. సకల జీవులను దయతో చూడాలని, వాటిపై కారుణ్యం చూపాలనే తత్వం, మనస్తత్వం మనది. గోవు తల్లిలాంటిది. అందుకే గోవును గోమాత అంటారు. ఆ మూగజీవాలకు హృదయం లేదనుకోకండి...ఆప్యాయంగా పిలిస్తే..పరుగెత్తుకొచ్చే గోవులెన్నో వున్నాయి. మనుషులతో కలివిడిగా వుంటూ సహజీవనం సాగిస్తుంటాయవి. అంతేకాదు, గోమాత అంటే సకల దేవతాస్వరూపం. గోవు పాలు అపురూపం.. శిశువులకు అమృతం.. ఇలాంటి మాటలెన్ని చెప్పినా తరగవు.. గోవుల విశిష్టతా తరగదు. అయినా, వ్యాపారమే పరమావధిగా భావించేవారికి ఇలాంటి వేమీ గిట్టవు. డబ్బే ప్రధానంగా జీవించేవారికి, గోవుల్ని అడ్డంగా నరికి పోగులు పెట్టేవారికీ జీవకారుణ్యం అంటే ఏమి తెలుస్తుంది?..మొన్నటికి మొన్న నెల్లూరులోని బోడిగాడితోట వద్ద అత్యంత దారుణంగా జరుగుతున్న గోవధ కథనాలు కంటతడిపెట్టిస్తాయి. ఆ కిరాతకాన్ని వూహించుకుంటే చాలు..మనిషన్నవాడికి ఎవడికైనా కన్నీళ్ళు జలజలా రాలుతాయి. కానీ, కొందరు ఏ మాత్రం దయ లేకుండా, డబ్బు కోసం గోవులను అలా యథేచ్ఛగా నరికేస్తుండడం దారుణం..ఘోరాతి ఘోరం!..మానవీయ సమాజంలో ఇది అత్యంత హేయమైన విషయం. ఈ గోవధ విషయం పత్రికల్లో చూసిన బిజెపి, విహెచ్‌పి నేతలు వెంటనే స్పందించడం అభినందనీయం. ఈ ఘోరకలిని అడ్డుకోవాలని వారు అధికారులకు విన్నవించుకున్నారు. పావన పెన్నా నదీ తీరంలో, బోడిగాడితోట ప్రాంతాల్లో ప్రతిరోజూ ఇలా గోవధ నిరంతరం నిరంతరాయంగా జరిగిపోతూనే వుందని, గోవులను అత్యంత క్రూరంగా, కిరాతకంగా వధించి, వాటి మాంసాన్ని విక్రయించి డబ్బు చేసుకోవడం దారుణమని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిడతల రమేష్, విహెచ్‌పి రాష్ట్ర కార్యదర్శి మెంటా రామ్మోహనరావు, జిల్లా కార్యదర్శి వి. రాజగోపాల్‌రెడ్డి తదితరులు గోవధపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడంతో, నగరపాలక సంస్థ అధికారులు కూడా వెంటనే దిగివచ్చారు. గోవధ జరుగుతున్న ప్రాంతాలపై దాడులు నిర్వహించారు. హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది హుటాహుటిన పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. గోవధ జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆకస్మికంగా దాడులు చేయడం గోవధ చేసేవారితో పాటు, ఆ మాంసం కొనుగోలుదారులనూ బెంబేలెత్తించింది. అయ్యప్పగుడి ప్రాంతంలో గోవులను చంపి మాంసం విక్రయించేందుకు సిద్ధంగావున్న వారిని పట్టుకోవడానికి అధికారులు ప్రయత్నించగా, అప్పటికే వారు పరుగులు తీశారు. అక్కడున్న గోవు మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్ పరిసర ప్రాంతాల్లోనూ తనిఖీలు చేశారు. అక్కడ వధకు సిద్ధంగా వున్న గోవులను చూసి వాటిని స్వాధీనం చేసుకుని బందెలదొడ్డికి తరలించారు. అధికారులు మానవతాహృదయంతో ఇలా ఆకస్మిక తనిఖీలు చేయడంతో అక్కడక్కడా యథేచ్ఛగా జరుగుతున్న గోవధ, గోమాంస విక్రయాలు బహిరంగంగానే బయటపడ్డాయి. ఈ తనిఖీల్లో దాదాపు రెండు లక్షల రూపాయల గోమాంసం పట్టుబడిందంటే, నిత్యం ఈ ప్రాంతాల్లో గోవధ ఎంత సాధారణచర్యగా జరుగుతోందో ఊహించు కోవచ్చు. ఈ సందర్భంగా బిజెపి, విహెచ్‌పి నాయకులు మిడతల రమేష్, మెంటా రామ్మోహనరావు తదితరులు మాట్లాడుతూ, గోవధపై అధికారులు దృష్టి పెట్టి, గోవధను నిరోధించేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. గోవులను వధించి వాటి మాంసాన్ని విక్రయించుకోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని, ఇది కిరాతకమని, దీన్ని వెంటనే పూర్తిగా నివారించాలని వారు అధికారులను కోరారు. గోసంరక్షణ కోసం, జంతు రక్షణ కోసం చట్టాలెన్ని వున్నా అవి సక్రమంగా అమలుకావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదేమైనా, అధికారులు ఆ మేరకు స్పందించడం అభినందనీయమే.

అయితే, ఎప్పుడో ఒకసారి అని కాక, ప్రతినిత్యం గోవధ ప్రాంతాలపై డేగకన్ను వేసి, వాటిని పూర్తిస్థాయిలో నిరోధించాలి. గోవధ చేసి మాంసాన్ని విక్రయిస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాల్సివుంది. ఒక్క నగరంలోనే కాదు, జిల్లావ్యాప్తంగా పూర్తిస్థాయిలో నిఘా పెట్టి గోవధను పూర్తిగా అరికట్టాల్సి వుంది. గోవుల సంరక్షణకు తక్షణం ఏర్పాట్లు చేయాల్సివుంది.

ADMISSIONS - 2014
B.E/ B.Tech
(All Branches)
Chennai Top Colleges
Konda Reddy
098416 05100 (TN)

క్రమశిక్షణ ! కృషితో నాస్తి దుర్భిక్షం ఉత్తమ బోధన !
శ్రీ జి.వి.యస్. శంకరయ్య మెమోరియల్ హైస్కూల్
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన సంస్థ
మాళవ్యనగర్, గూడూరు. ఫోన్ : 253761, 94414 90885
స్థాపించిన నాటి నుంచే అత్యధిక ఉత్తీర్ణతా శాతంతోపాటు, అత్యధిక మార్కులు సాధిస్తూ 2014 మార్చి ఫలితాలను కూడా మీముందు తీసుకొనిరావటానికి సంతోషిస్తున్నాము. అద్భుత ఫలితాలను సాధించిన మా విద్యా కుసుమాలకు, తల్లిదండ్రులకు మరియు అధ్యాపకులకు అభినందనలు.
గూడూరు పట్టణములో అత్యధికంగా 85 మందితో 9 నుండి 10 GPA గ్రేడులతో ముందుకు దూసుకెళ్తున్న ఏకైక విద్యా సంస్థ
SSC 2013-14 పరీక్షా ఫలితాలలో A1 గ్రేడ్‌లు సాధించిన మా విద్యా కుసుమాలు

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 9.8 | 9.8 | 9.8 | 9.8 | 9.8 | 9.8 | 9.8 |
| K.Harsha Vardhan | K.Preethi Tejasree | K.Meghana | K.Jaswanth | E.Sai Kiran | M.Vishnu Vardhan | T. Prince Rufus |
| HT No.141712 6515 | HT No.141712 6519 | HT No.141712 6529 | HT No.141712 6587 | HT No.141712 6593 | HT No.141712 6601 | HT No.141712 6631 |
| 9.8 | 9.8 | 9.8 | 9.8 | 9.8 | 9.8 | 9.8 |
| N.Harshitha | V. Sreeja | D. Bharath Sai | K.Pavan Kumar | P.Usha | M.Sri Sai Kumar | K.Raja Sekhar |
| HT No.141712 6709 | HT No.141712 6519 | HT No.1417127411 | HT No.141712 7411 | HT No.141712 6683 | HT No.141712 6691 | HT No.141712 6677 |





తరాలు మారినా తరగని ధైర్యం...
ప్రతి అక్షరంలోనూ ప్రతిబింబిస్తుంది సింహపురి శౌర్యం!
లాయర్
తెలుగు వారపత్రికకు
33వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.


డా॥ రవికుమార్
RICH HOSPITALS FOR CHILDREN
రిచ్ చిన్నపిల్లల హాస్పిటల్
పొగతోట, నెల్లూరు ఫోన్ : 0861-2328562,

Director & Chief Consultant
Dr. T. Ravikumar MD., DCH

Senior Consultant Pediatricians
Dr. G. Narayana Swamy
Dr. Ch. Hazarathaiah
Dr. Sk. Nazeer
Dr. R. Umamaheswara Rao

24 గం॥లు చిన్నపిల్లల స్పెషలిస్టులచే వైద్యం చేయు ఏకైక చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

# నెల్లూరు కబుర్లు



## ఛలో గుంటూరు

ఈ నెల 8వ తేదీన గుంటూరులో జరిగే చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి నెల్లూరుజిల్లా నుండి భారీ సంఖ్యలో వెళ్లడానికి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటివరకు ముఖ్యమంత్రుల ప్రమాణస్వీకారం హైదరాబాద్‌లో జరుగుతూ వచ్చింది కాబట్టి నాయకులు తప్పితే కార్యకర్తలు పెద్దగా వెళ్ళేవాళ్లు కాదు. కాని రాష్ట్ర విభజన నేపథ్యంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు తన ప్రమాణస్వీకారాన్ని సీమాంధ్రలో మధ్యస్థంగా ఉండే గుంటూరులో చేయాలని నిర్ణయించుకున్నారు. గుంటూరుకు నెల్లూరుకు నాలుగుగుంటల ప్రయాణం. నెల్లూరు నుండి ప్రమాణస్వీకారం జరిగే స్థలం వరకు నాలుగు లైన్ల రహదారి. మధ్యాహ్నం వెళ్లినా రాత్రికి తిరిగిరావచ్చు. రాత్రికి అక్కడ బస చేయాలన్నా బాధ లేదు. దీంతో బస్సులు, కార్లు, వ్యాన్లు వంటి వాహనాలలో గుంటూరుకు పెద్దసంఖ్యలో వెళ్లడానికి రెడీ అవుతున్నారు.



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతున్న తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడుని ఈ నెల 3వ తేదీన హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న నెల్లూరు నగరపాలకసంస్థ తెలుగుదేశంపార్టీ మేయర్ అభ్యర్థి, 8వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ జడ్.శివప్రసాద్

## వెంకయ్య సహకారంతో అభివృద్ధి



విలేకర్లతో మాట్లాడుతున్న కర్నాటి ఆంజనేయరెడ్డి

కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు సహకారంతో నెల్లూరుజిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో వంద స్మార్ట్ నగరాలను అభివృద్ధి చేస్తామని నరేంద్రమోడీ చెప్పారని, ఆ కలను నిజం చేయగల సత్తా వెంకయ్యనాయుడుకి ఉందన్నారు. వెంకయ్యనాయుడు మీద ఉన్న నమ్మకంతోనే ఆయనకు పట్టణాభివృద్ధిశాఖ అప్పగించారన్నారు. నెల్లూరుకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, అవుటర్ రింగ్‌రోడ్ నిర్మాణం వంటివి వెంకయ్యనాయుడు నెరవేరుస్తారన్నారు. రాష్ట్ర విభజన సమయంలో సీమాంధ్ర ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చేందుకు ఎన్డీఏ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. నెల్లూరు నుండి హైదరాబాద్‌కు ప్రత్యేక రైలు సౌకర్యం కోసం కేంద్రమంత్రుల ద్వారా కృషి చేస్తామన్నారు.

ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కందుకూరి సత్యనారాయణ, కె.ఎస్.చక్రధారి, యరబోలు, మండ్ల ఈశ్వరయ్య, ఎం.శ్రీనివాసులు, కుడుముల గిరికుమార్‌గౌడ్, రమణప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధికి కృషి చేస్తాం

**- తెదేపా నేతలు**

నెల్లూరులో జూన్ 1వ తేదీ తెదేపా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నగర నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు పాల్గొని మాట్లాడారు. జిల్లాలో అభివృద్ధికి సంబంధించిన అంశాలను చంద్రబాబుకు తెలుపుతామన్నారు. వెంకయ్యనాయుడు సహకారంతో జిల్లాకు నిధులు విరివిగా తీసుకొచ్చి నెల్లూరు నగరంలో భూగర్భడ్రైనేజీ, రింగ్‌రోడ్డు తదితర అభివృద్ధి పనులు చేస్తామన్నారు. బిట్రగుంటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. జిల్లాను పారిశ్రామికంగా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ హబ్‌గా తయారు చేస్తామని తెలిపారు. జిల్లాలో విమానాశ్రయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా బీద రవిచంద్ర మాట్లాడుతూ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పార్టీ ఓటమిపై మండల, నియోజకవర్గాల వారీగా సమీక్షించి కారణాలు తెలుసుకుంటామన్నారు. సమావేశంలో విజయడెయిరీ ఛైర్మెన్ కె.రంగారెడ్డి, కార్పొరేటర్ దొడ్డపనేని రాజానాయుడు, పేర్నేటి కోటేశ్వరరెడ్డి, హరిబాబుయాదవ్, స్వర్ణా వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ఇన్‌స్పెక్టర్లకు సన్మానం



నెల్లూరు పోలీసు కవాతు మైదానంలో మే 30వ తేదీన ఉద్యోగ విరమణ చేసిన పోలీసు ఇన్‌స్పెక్టర్లు ఎస్.రామారావు, ఐ.దశరధరామయ్యలను పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు మద్దిపాటి ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మైదానంలోని ఉమేష్‌చంద్ర సమావేశమందిరంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఏసీ నాగేశ్వరరావు, హెచ్ఆర్‌సి ఏ.నాగేంద్ర, ఎస్‌బిలు జె.నాగేశ్వరరావు, ప్రభాకర్‌రావు, బి.నాగేంద్రసింగ్, గౌస్‌బాషా, ఏఎస్‌ఐ ధర్మారావులు వీరిద్దరిని గౌరవపూర్వకంగా సత్కరించారు. కార్యక్రమంలో నెల్లూరు డిఎస్పీలు వెంకటనాథ్‌రెడ్డి, రాంబాబు, పోలీసు అధికారుల సంఘం గౌరవాధ్యక్షులు ఎం.గంగాధర్‌రావు, గౌరవసలహాదారులు జి.మాధవ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### రంగనాథుని దర్శించిన
## తమిళనాడు హైకోర్టు జడ్జి

తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి కణ్ణన్ గత నెల 30న కుటుంబసభ్యులతో కలసివచ్చి నెల్లూరు రంగనాయకుల పేటలోని తల్పగిరి రంగనాథస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలోని తల్పగిరి రంగనాధుని, వెంకటేశ్వరస్వామిని, దేవేరులను దర్శించి పూజలు చేయించుకున్నారు. ఆలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు, అర్చకులు ఆయనను ఆలయ మర్యాదలతో గౌరవించారు.

### ఘనంగా ఏఆర్ఏఎస్పీకి
## ఉద్యోగ విరమణ వీడ్కోలు



ఉద్యోగ విరమణ పొందిన జిల్లా ఏఆర్ఏఎస్పీ ఏసీ నాగేశ్వరరావు నెల్లూరు పోలీసు కవాతు మైదానంలో ఏఎస్పీ ఆర్.గంగాధర్ ఆధ్వర్యంలో ఏఆర్ పోలీసులు ఘనంగా వీడ్కోలు పలికారు. గుర్రంపై కూర్చోబెట్టి ఆయనను గజమాల, శాలువాతో సత్కరించి కవాతు మైదానం నుంచి ఆయన నివాసం వరకు ఊరేగింపు జరిపి గౌరవంగా సాగనంపారు. కార్యక్రమంలో ఏఆర్ ఆర్ఐ శ్రీనివాసరావు, ఎంటిఓ అంకమరావు, ఏఆర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### జిల్లా సహకార అధికారిగా
## దూడల రాజేశ్వరరావు

జిల్లా సహకార అధికారిగా విధులు నిర్వహిస్తున్న కె.బి.మల్లికార్జునరెడ్డి మే నెల 30న ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో గూడూరు డివిఎల్‌సిఓగా పనిచేస్తున్న దూడల రాజేశ్వరరావు నియమితులై బాధ్యతలు చేపట్టారు.

## అమ్మవారి ఆదాయం

నెల్లూరు దుర్గామిట్టలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో హుండీ లెక్కింపు సోమవారం జరిగింది. మార్చి 24 నుండి జూన్ 2వ తేదీ వరకు హుండీ ద్వారా 1,06,914రూపాయల ఆదాయం లభించింది. ఈ కార్యక్రమంలో రత్నం జయరాం, పాయసం నాగేశ్వరరావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ధూమపాన వ్యతిరేక దినోత్సవం





అంతర్జాతీయ ధూమపాన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మే 31న ఎన్‌సిసి ఆధ్వర్యంలో సర్వోదయ కళాశాల నుండి వి.ఆర్ కళాశాల, గాంధీ బొమ్మ, మద్రాసు బస్టాండుల మీదుగా ర్యాలీ జరిగింది. నగరంలోని వి.ఆర్. కళాశాల, సర్వోదయ కళాశాల, కె.ఏ.సి కళాశాల, కె.ఎన్.ఆర్. మున్సిపల్ హైస్కూలు ఎన్.సి.సి క్యాడెట్స్ ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ కమాండర్ సి.వి.సురేష్‌బాబు ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ పొగాకును వివిధ రూపాలలో సేవించడం, ముఖ్యంగా పొగత్రాగడం వల్ల ఏర్పడే అనారోగ్యం గురించి వివరించారు. క్యాడెట్స్ ధూమపానం క్యాన్సర్ కారకం, ఆరోగ్యానికి హానికరం అంటూ నినాదాలు చేసారు. కార్యక్రమంలో సబ్‌లెఫ్టినెంట్ కమాండర్ ఎన్.ప్రభాకర్, హెచ్.కె.రెడ్డి, కోటేశ్వరరావు, సతీష్, జి.నరేంద్రబాబు, శివ, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు 'వాకర్స్' నజరానా



నెల్లూరు దర్గామిట్టలోని ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియంలో వేసవిసెలవుల్లో క్రీడా శిక్షణ పొందుతున్న 800మంది పిల్లలకు స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 8 నుండి 31వ తేదీ వరకు ప్రతిరోజూ పౌష్టికాహారం పంపిణీ ఉచితంగా అందించారు. ముగింపురోజైన మే 31న ఉదయం 7గంటలకు అసోసియేషన్ నిర్వహణలో దాతలు రొటేరియన్స్ ఎస్.రాఘవేంద్రశెట్టి, పలగాటి శ్రీనివాసులురెడ్డి, మురళీకృష్ణ హోటల్స్ యం.డి హజరత్‌బాబు, డాక్టర్ అట్ల సునీల్‌కుమార్‌రెడ్డిలు పిల్లలకు కేకులు, ద్రాక్షరసం, టూత్‌పేస్ట్, బ్రష్‌లు అందించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా డిఎస్‌డిఓ ఎతిరాజ్, డిస్ట్రిక్ట్ 203 గవర్నరు ఎం.వి.సుబ్బారెడ్డి, మాజీగవర్నర్ డా॥ కె.అంకిరెడ్డి, అసోసియేషన్ అధ్యక్షులు దయాకర్‌రెడ్డి, కార్యదర్శి శేషగిరిరావు, కోశాధికారి నారాయణరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ నలుబోలు బలరామయ్యనాయుడు, ఛైర్‌పర్సన్ రవిచంద్ర, హరికృష్ణ, ఓబులురెడ్డి, దశయ్య, వి.రంగారావు, డాక్టర్ దొరస్వామినాయుడు, దద్దోలు రమణయ్య, కిలారి తిరుపతినాయుడు, ఎల్లారెడ్డి, ఎస్.రమేష్, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

## కమలాకరంకు ప్రజావాకర్స్ సత్కారం



నెల్లూరు, పొదలకూరురోడ్డులోని జిల్లా ప్రజాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో మే31న జిల్లా ప్రజావాకర్స్ సంఘం ఆధ్వర్యంలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఆఫీసరుగా పనిచేస్తూ పదవీవిరమణ చేసిన వాకర్స్ సంఘం సభ్యులు పి.జె.కమలాకరంను ఘనంగా సత్కరించారు. టి.వి.రమణయ్య అధ్యక్షతన జరిగిన సభలో కార్యదర్శి యం.శ్రీనివాసరావు, కోశాధికారి ఓంకారం సుబ్బరాయుడు, యం.వి.కృష్ణయ్య, రాజగోపాల్, రాణెమ్మ, ఎబినైజర్ తదితరులు కమలాకరంను శాలువా, గంధపుమాలతో గౌరవంగా సన్మానించి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

# మాగుంట లేఅవుట్ సమస్యలు పరిష్కరిస్తా!



కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి సమస్యను వివరిస్తున్న మాగుంట లే అవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్ సభ్యులు

నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమవారం మాగుంట లేఅవుట్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఎస్ఆర్‌కె స్కూల్ మలుపు వద్ద రోడ్డు వెడల్పు చేయాల్సిన అవసరాన్ని మాగుంట లే అవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్‌తో చర్చించి ఈ పని అయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారు. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు సహకారంతో నగరాన్ని అందంగా తీర్చిదిద్దుతామని అన్నారు. రాబోయే ఐదేళ్లు ఎలాంటి రాజకీయ వివాదాలకు తావులేకుండా నగరాభివృద్ధిపైనే దృష్టి సారిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో మాగుంట లే అవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కనుమూరు శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యక్షులు గోళ్లమూడి శ్రీధర్‌రెడ్డి, సహకార్యదర్శి హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

## శ్రీసిటీలో మలేషియా బృందం



తడ మండలంలోని ప్రముఖ పారిశ్రామిక కేంద్రం శ్రీసిటీని సోమవారం మలేషియా వాణిజ్యబృందం సందర్శించింది. శ్రీసిటీలోని అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులను, శ్రీసిటీలోని పరిశ్రమలను గురించి తెలుసుకున్నారు. శ్రీసిటీ ఛైర్మెన్ రవిసన్నారెడ్డి వీరికి స్వాగతం పలికారు.

# వైకాపా పార్లమెంటరీ నేతగా మేకపాటి

### అది లేకున్నా... ఇది దక్కింది!



వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ పార్లమెంటరీ నేతగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి నియమితులయ్యారు. పార్టీ ఎంపీలలో ఆయనే సీనియర్ కాబట్టి ఈ పదవిని ఆయనకే కట్టబెట్టారు. వాస్తవంగా ఆయన కలలు కంటున్న పదవి ఇది కాదు. కేంద్రమంత్రి పదవి. స్వయంగా పార్టీ అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డే ఆయనకు ఆ విధమైన ఆశలు కల్పించారు. ఎన్నికలకు ముందు వీరి ఆలోచన వేరే విధంగా ఉండింది. సీమాంధ్రలో వైకాపాకు 18నుండి 20 పార్లమెంట్ సీట్లు వస్తాయి. కేంద్రంలో హంగ్ ఫలితాలొస్తాయి. ఎవరు ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకున్నా వైకాపా మద్దతు అవసరమవుతుందనుకున్నారు. ఆ లెక్కలోనే మేకపాటి రాజమోహన్‌రెడ్డి మంత్రిపదవి ఆశపడుతూ వచ్చారు. తీరాచూస్తే మేకపాటి అతికష్టం మీద గెలిచినా, కేంద్రంలో ఎన్డీఏకు పూర్తి మెజార్టీ రావడంతో ఈయనకు కేంద్రమంత్రి యోగం లేకుండాపోయింది.

# గూడూరులో జగన్నాథ రథయాత్ర



గోడపత్రాన్ని విడుదల చేస్తున్న సుకదేవస్వామి, నూనె మల్లిఖార్జునయాదవ్ తదితరులు

కరువు కాటకాలు, అశాంతి నివారణ కోసం జూలై 12వ తేదీన గూడూరులో 2వసారి జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తున్నట్లు అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం ప్రతినిధి డాక్టర్ సుకదేవస్వామి తెలిపారు. సోమవారం నెల్లూరులోని ఇస్కాన్ మందిరంలో ఈ రథయాత్రకు సంబంధించిన గోడపత్రాన్ని విడుదల చేసారు. ఈ సందర్భంగా సుకదేవస్వామి మాట్లాడుతూ ఈ రథయాత్రకు కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు, సినీ హీరో పవన్‌కల్యాణ్‌లను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈ రథయాత్రకు తమిళనాడు, మహారాష్ట్ర, కర్నాటక, పశ్చిమబెంగాల్, ఒడిసా రాష్ట్రాల నుండి 500మంది ఇస్కాన్ భక్తులు పాల్గొంటారన్నారు. జూలై 12వ తేదీ మధ్యాహ్నం 2.30గంటలకు గూడూరులోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్ నుండి బయలుదేరి సంగం థియేటర్, గాంధీబొమ్మ, బనిగిసాహెబ్ సెంటర్, క్లాక్‌టవర్, రాజావీధిల మీదుగా తిరిగి కమ్యూనిటీ హాల్‌కు చేరుకుంటుందన్నారు. రథయాత్ర అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, భోజన ప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ నూనె మల్లికార్జునయాదవ్, భానుప్రకాశ్, ఐబిఎం సర్వేశం, డి.వి.కృష్ణారెడ్డి, రాజశేఖరదాసు, డివిఎస్ గిరి పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# డిగ్రీలో బాలికలే టాప్



ఫలితాలను విడుదల చేస్తున్న ఆచార్య రాజారామిరెడ్డి

విక్రమ సింహపురి యూనివర్శిటీ డిగ్రీ పరీక్షా ఫలితాలను సోమవారం యూనివర్శిటీ పరిపాలనా భవనంలో ఉపకులపతి ఆచార్య రాజారామిరెడ్డి విడుదల చేసారు. ఈ ఫలితాలలో అమ్మాయిలే పైచేయి సాధించారు. మూడు సంవత్సరాలలోనూ అమ్మాయిలదే ఉత్తీర్ణత శాతం ఎక్కువుగా వుంది. మొదటి సంవత్సరంలో 42.44 ఉత్తీర్ణత సాధించగా అందులో బాలురు 31.68శాతం, బాలికలు 57.72శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరంలో 51.23శాతం ఉత్తీర్ణత సాధించగా బాలురు 38.96శాతం, బాలికలు 66.78శాతం ఉత్తీర్ణత సాధించారు. మూడో సంవత్సరం ఫలితాలలో 59.14శాతం ఉత్తీర్ణత సాధించగా అందులో బాలురు 49.98శాతం, బాలికలు 70.69శాతం ఉత్తీర్ణత సాధించారు. డిగ్రీ మూడు సంవత్సరాలు పాసైన విద్యార్థులలో 1522మంది డిస్టింక్షన్‌లు, 2064మంది ఫస్ట్‌క్లాస్, 212మంది సెకెండ్‌క్లాస్, 39మంది థర్డ్‌క్లాస్‌లో పాసయ్యారు. మొదటి, రెండు సంవత్సరాలలో అన్ని సబ్జెక్ట్‌లు పాసై మూడో సంవత్సరంలో ఫెయిలైన వారికి ఈ నెల 10 నుండి 14వ తేదీ వరకు ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైస్‌ఛాన్సలర్ ఆచార్య రాజారామిరెడ్డి తెలిపారు.

ఈ నెల 18వ తేదీ నుండి పీజీ కౌన్సిలింగ్ ప్రారంభమవుతుందని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ కె.నాగేంద్రప్రసాద్ తెలిపారు. 18వ తేదీ కెమిస్ట్రీ ఎడ్యుకేషన్, 19వ తేదీ కంప్యూటర్‌సైన్స్, ఫిజిక్స్, ఇంగ్లీష్, తెలుగు, 20వ తేదీ మ్యాథ్స్, కామర్స్, 21వ తేదీ మెరైన్ బయాలజీ, జూవాలజీ, బోటని, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, ఫుడ్ టెక్నాలజీ, హ్యూమన్, న్యూట్రిషన్ అండ్ న్యూట్రాసుటికల్ కెమిస్ట్రీ, స్టాటిస్టిక్స్, సోషల్ వర్క్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ కోర్సులకు కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. యూనివర్శిటీ సెమినార్‌హాల్‌లో కౌన్సిలింగ్ జరుగుతుందని ఆయన తెలిపారు.

నీతికి నిర్భీతికి ప్రతీక
నిష్పాక్షిక సమాచార వేదిక
లాయర్
తెలుగు వారపత్రికకు
33వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు.







కె. ధనుంజయరెడ్డి
ఛైర్మన్



కె. దీపక్‌రామ్‌రెడ్డి
మేనేజింగ్ డైరెక్టర్

D.R. UTTHAMA HOTEL
Winner of Excellence Award 2004, 2005 & 2006





ఈ నెల 4వ తేదీన తిరుపతిలో జరిగిన టిడిఎల్‌పి సమావేశంలో టిడిఎల్‌పి నేతగా ఎన్నికైన చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

## ప్రమాణంతో ప్రయాణం

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్ పదేళ్ల ఉమ్మడి రాష్ట్రాలకు రాజధాని అయినప్పటికి చంద్రబాబు గుంటూరులోనే ప్రమాణస్వీకారోత్సవం పెట్టడానికి కారణం వీలైనంత త్వరగా సీమాంధ్ర ప్రజలను కొత్తరాజధానికి అలవాటు పడేలా చేయాలనుకోవడమే. రాష్ట్ర విభజన తర్వాత ఆదాయాన్నిచ్చే హైదరాబాద్ కోల్పోయి, ఉమ్మడిరాష్ట్రానికి చేసిన అప్పులు పంచుకుని, తెలంగాణ విడిపోగా మిగిలిన 13సీమాంధ్ర జిల్లాలను కలుపుకుని అవశేష ఆంధ్రప్రదేశ్‌గా మిగిలిన ఈ రాష్ట్రానికి తొలిముఖ్య మంత్రిగా లోటుబడ్జెట్‌తో చంద్రబాబు ప్రయాణం మొదలుపెట్టబోతున్నాడు. రాష్ట్ర విభజన పేరుతో గత యూపిఏ ప్రభుత్వం సీమాంధ్రకు చేసిన ద్రోహం చిన్నదికాదు. ఓట్లు, సీట్లు కక్కుర్తితో సోనియాగాంధీ చేయరాని పాపం చేసింది. కోట్లాదిమంది మనసులను క్షోభపెట్టింది. మొన్న ఎన్నికల లోనే సగం పాపం పండింది. కాంగ్రెస్ పార్టీని ప్రజలు హీనస్థితికి చేర్చారు. మిగిలిన సగం పాపం కూడా పూరికేపోదు. అప్పుల చిప్ప ఆంధ్రాకు, ఆస్తుల కుప్ప తెలంగాణకు ఇచ్చి సోనియా చరిత్రహీనురాలిగా మిగిలిపోయింది.

గోచిగుడ్డతో మిగిలిన సీమాంధ్రకు చంద్రబాబు తొలిముఖ్యమంత్రి. ఆరంభం లోనే ప్రయాణం అగచాట్లమయం. రాష్ట్రం అసలే లోటుబడ్జెట్‌తో, ఉద్యోగులకు జీతాలు చెల్లించడానికి కూడా వెంపర్లాడే పరిస్థితులున్నాయి. ఈ దశలో ఎన్నికల్లో చంద్రబాబు మాత్రం నాలుకకు నరం లేదన్నట్లు వరాలిచ్చేసి ఉన్నాడు. ముఖ్యంగా ఆయన హామీ ఇచ్చిన ఋణమాఫీ రాష్ట్రానికి పెను ఆర్థిక భారంకానుంది. రైతు, డ్వాక్రా ఋణాలు కలిసే లక్షకోట్లుంటాయి. అసలే లోటు బడ్జెట్‌లో వున్న రాష్ట్రానికి ఇది పెద్ద గుదిబండ. ఋణాలు మాఫీ చేస్తే బ్యాంకుల ఆర్థిక వ్యవహారాలు ప్రతిష్టంభనలో పడతాయి. ఇంత డబ్బు కట్టే పరిస్థితి ప్రభుత్వం వద్ద లేదు. ఋణమాఫీ చేస్తున్నాం, డబ్బు కావాలంటే కేంద్రం కూడా ఇచ్చే పరిస్థితి లేదు. చంద్రబాబు అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం ఇదే కాబట్టి దీనిని ఆయన అమలు చేయక తప్పదు.

ముఖ్యంగా ఎన్డీఏ భాగస్వామ్య ప్రతినిధిగా చంద్రబాబు ఈ ఐదేళ్ల పాలనలో ప్రతిష్టాత్మకమైన కేంద్ర సంస్థలన్నింటిని సీమాంధ్రకు తీసుకురావాల్సివుంది. జాతీయ విద్య, వైద్య, ఇతర కేంద్ర సంస్థలన్నీ హైదరాబాద్‌లోనే వున్నాయి. ఇప్పుడు సీమాంధ్రలో కూడా వీటన్నింటిని నెలకొల్పాల్సి వుంది. సికింద్రాబాద్ కేంద్రంగా వున్న దక్షిణమధ్య రైల్వే జోన్‌కు సీమాంధ్ర నుండే ఎక్కువ ఆదాయం ఉండేది. ఇప్పుడు సీమాంధ్ర కేంద్రంగా ప్రత్యేక రైల్వేజోన్ ఏర్పాటుకు కృషి చేయాలి. చెన్నై నుండి విశాఖ వరకు కోస్టల్ కారిడార్‌తో సీమాంధ్ర ప్రగతికి మార్గం ఏర్పడుతుంది. పారిశ్రామిక విధానాన్ని సరళీకృతం చేసి అధిక పెట్టుబడులను ఆకర్షించాల్సి వుంది. ముఖ్యంగా కేంద్రం ద్వారా రాష్ట్రానికి పదేళ్ళన్నా స్వయం ప్రతిపత్తి హోదాను పొందితే రాష్ట్రానికి పరిశ్రమలు పరుగులు తీస్తాయి. మనోళ్ల కూడా తెలంగాణలో ఉన్న పరిశ్రమలను సీమాంధ్రకు తరలించే అవకాశముంది. సీమాంధ్ర నిర్మాణంను ఇప్పుడు పునాది రాయి నుండి నిర్మించాల్సి వుంది. దేశవిదేశాల్లో వున్న సీమాంధ్రులనంతా ఏకీకృతం చేసి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలి. పెండింగ్‌లో వున్న సాగునీటి ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలి. కోస్తా తీరంలో పోర్టులను నిర్మించి వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలను పెంచాలి. కేంద్రం నుండి వీలైనంత సహకారం పొందుతూ రాష్ట్రాన్ని ముందుకు నడపాల్సిన బరువైన బాధ్యతను చంద్రబాబు సమర్థవంతంగా నెరవేర్చాల్సి వుంది. ఈ నెల 8న ఆంధ్రప్రదేశ్ సీఎంగా ఆయన ప్రమాణంతో ఆయన ప్రయాణం మొదలుపెడుతున్నారు. ఈ ప్రయాణం సాఫీగా సాగిపోవాలని ఆకాంక్షిద్దాం.

## యూపీగా మారుతున్న ఏపి

(మొదటిపేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్‌కు సోకినట్లుగా కనిపిస్తుంది. ఎన్నికల్లో రెడ్లు ఒక పార్టీ, కమ్మ వర్గం ఓ పార్టీ అన్నట్లు ప్రచారం కల్పించారు. చరిత్రను పరిశీలిస్తే రాష్ట్రంలో కుల రాజకీయాలు ఎప్పుడూ లేవు. 1983లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని పెట్టారు. ఆ పార్టీలో కీలకపాత్ర పోషించిన నాయకులంతా రెడ్డి వర్గం వారే! తెలుగుదేశం అధికారంలోకి రావడంలో కూడా కీలకపాత్ర వారిదే! నాటి ఎన్టీఆర్ నుండి 1999లో చంద్రబాబు రెండోసారి అధికారంలోకి రావడం వరకు కూడా రెడ్డి వర్గీయులు తెలుగుదేశంకు బలమైన మద్దతుదారులుగానే నిలిచారు. కాని మొన్న ఎన్నికల నుండి తెలుగుదేశంలో ఒక విధమైన కులం కంపు కనిపిస్తుంది. పార్టీలోని ఒక ప్రధాన వర్గం 'రెడ్డి' వర్గానికి చెందిన వాళ్లను శత్రువులుగా చూస్తుంది. ఈ ఎన్నికలు తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీల మధ్య జరిగినట్లుగా కాకుండా, రెడ్డి - కమ్మ వర్గాల మధ్య జరిగినట్లుగా చిత్రీకరిస్తుంది. ఇలాంటి పోకడలు ఏ రాజకీయ పార్టీకి మంచివి కాదు. రాజకీయాల్లో పరిస్థితులు, పరిణామాలను బట్టి ప్రజలు తమ నేతలను ఎన్నుకుంటుంటారు. తెలుగుదేశం మీద వ్యతిరేకత వచ్చినప్పుడు 'కమ్మ' వర్గీయులు కాంగ్రెస్‌కు ఓట్లేసారు. కాంగ్రెస్ మీద కోపం వచ్చినప్పుడు 'రెడ్లు' తెలుగుదేశాన్ని గెలిపించారు. ఏ పార్టీకి ఏ కులం, ఏ మతం అనుబంధంగా ఉండదనేది ప్రధాన నేతలు గ్రహించుకోవాలి. కులజాడ్యాన్ని వదిలించుకుని, అందరినీ కలుపుకుపోయి బలం పెంచుకోవాలి.

# ప్రగతి రథం.. ఇక పరుగులెత్తాలి!

### --- అభివృద్ధిలో సింహపురిసీమ అగ్రగామి కావాలి ---



నెల్లూరుజిల్లా చరిత్ర ఎంతో ఘనమైనది. ఎందరో రాజులు సింహపురి సీమను పాలించారు. మరెందరో మహనీయులు ఇక్కడ ఉద్భవించి జిల్లా కీర్తి పతాకను దశదిశలా రెపరెపలాడించారు. మహాభారతాన్ని ఆంధ్రీకరించిన మహాకవి తిక్కన గంటం పల్లవించిన చోటు ఇది. ఎనలేని విద్వత్తుతో అత్యద్భుతమైన రచనలతో తెలుగుభాషామతల్లి కీర్తిని అజరామరం చేసిన మహాకవి ఆయన. మహవీరుడు ఖడ్గతిక్కన, పతికే శౌర్యం నూరిపోసి కదనరంగానికి నడిపించిన వీరపత్ని చానమ్మ వంటి ధీరులు ఉద్భవించిన స్థలమిది. ఉద్దండ పండితులెందరో కొలువుదీరిన సీమ ఇది. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం వుండాలని ఆమరణదీక్ష చేసి అశువులు బాసిన మహా త్యాగి, అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు నడయాడిన నేల ఇది. స్వాతంత్ర్య సంగ్రామం సమయంలో జిల్లాలోనూ స్వాతంత్ర్యోద్యమానికి ఊపిరులూదిన ఒరుగంటి వెంకటసుబ్బయ్య, వెన్నెలకంటి రాఘవయ్య, డా.బెజవాడ గోపాలరెడ్డి, పొణకా కనకమ్మ వంటి ధీరులెందరో ఉద్యమకెరటాలై ఉప్పొంగిన ప్రాంతమిది. అసమాన శౌర్యానికి, పరాక్రమానికి పేరెన్నికగన్న విక్రమసింహపురి ఇది. పావన పినాకినీ నదీ ఘలంఘలలతో, పచ్చని వరి చేల సోయగాలతో, దివ్య క్షేత్రంగా రాష్ట్రవ్యాప్త ఖ్యాతిగాంచిన శ్రీ రంగనాధుని కోవెల కళాకాంతులతో, పెంచలకోన లక్ష్మీనృసింహుడు, జొన్నవాడ కామాక్షితాయి, వేదగిరి లక్ష్మీనారసింహుడు, మరోవైపు సూళ్ళూరుపేటలో చెంగాళమ్మ తల్లి, నెల్లూరు చెరువు ఒడ్డున కొలువైన గ్రామశక్తి ఇరుకళలపరమేశ్వరిదేవి వంటి పుణ్యక్షేత్రాలతో ఈ ప్రాంతమంతా ఆధ్యాత్మిక, సుప్రశాంత వాతావరణంతో అలరారుతూ వుంటుంది. ఎన్నెన్నో ఖ్యాతిగన్న విద్యాలయాలతో రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలోనూ పేరెన్నికగన్న విద్యాసంస్థలతో ఈ భూమి విద్యాభూమిగా, వేలు.. లక్షలాదిమంది విద్యార్థులకు విద్యాసుగంధ పరిమళాలను అద్దుతోంది. అటు విజ్ఞానశాస్త్రంలోనూ, అంతరిక్ష రంగంలోనూ నెల్లూరు సీమ ప్రపంచ విఖ్యాతిని అందుకుంటోంది. శ్రీహరికోట.. నెల్లూరు సీమ విజ్ఞానపు కోటగా ప్రసిద్ధి చెందుతూ, అనేకానేక రాకెట్‌ల ప్రయోగాలతో అంతరిక్ష ప్రయోగాల్లోనూ దీటుగా ముందుకు సాగుతూ జగద్విఖ్యాతి పొందుతోంది. దాదాపు 13వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించి, రాష్ట్ర విస్తీర్ణంలో 4.57 శాతం కలిగివున్న నెల్లూరుజిల్లాలో అటు వ్యవసాయ, ఇటు పారిశ్రామిక రంగాల్లోనూ మరెంతో అభివృద్ధి చెందేందుకు తగ్గ వనరులన్నీ పుష్కలంగా ఉన్నాయి. సోమశిల, కండలేరు వంటి జలాశయాలతో, పెన్నానది, స్వర్ణముఖి వంటి నదీనదాలతో కళకళలాడుతున్న జిల్లా ఇది. తూర్పున బంగాళాఖాతం, పడమర కడపజిల్లా, ఉత్తరాన ప్రకాశం, దక్షిణంలో చిత్తూరుజిల్లాతో పాటు, తమిళనాడు రాష్ట్రం సరిహద్దుగా వున్నాయి. వరికి పుట్టినిల్లుగా వుంటూ, శ్రేష్టమైన ధాన్యానికి పెట్టిందిపేరుగా వున్న ఈ జిల్లాలో అత్యధిక శాతం రైతులు వరినే ప్రధానపంటగా వేస్తున్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా పచ్చపచ్చని వరిపొలాలు కనువిందుగా కనిపిస్తుంటాయి. అటు మెట్ట ప్రాంతాల్లోనూ, ఇటు డెల్టా ప్రాంతంలోనూ వరితో పాటు, వేరుశెనగ తదితర పంటలు వేస్తుంటారు. మరోవైపు గూడూరు, పొదలకూరు, రాపూరు, వెంకటగిరి తదితర ప్రాంతాల్లో నిమ్మ పంట విస్తారంగా సాగులో వుంది. నిమ్మతోటలు, మామిడి తోటలు కొదవలేకుండా వున్న ప్రాంతమిది. వ్యవసాయ పరిశోధనారంగంలోనూ ముందడుగు వేస్తూ నెల్లూరులో వరి పరిశోధన కేంద్రం, పొదలకూరులో చిరుధాన్యాల పరిశోధన కేంద్రం, వెంకటగిరి సమీపంలోని పెట్లూరులో నిమ్మ పరిశోధన కేంద్రం వున్నాయి. వీటన్నిటినీ మరింత వృద్ధిలోకి తీసుకువస్తే, ఇవి రైతులకు మరెంతో ప్రయోజనం చేకూరుస్తాయి. అన్నిటికీ మించిన వరంగా ఈ జిల్లాకు 169 కిలోమీటర్ల సముద్ర తీరం వుంది. జిల్లాలోని మొత్తం 46 మండలాల్లో 12 మండలాలు ఈ సముద్రతీరంలో వుండడం విశేషం. తడ నుంచి తెట్టు దాకా వున్న తీరప్రాంతం లోని బకింగ్‌హామ్ కాలువ (ఉప్పు కాలువ) పూర్వకాలంలో రవాణాకు ఎంతో ప్రసిద్ధిగా వుండేది. ఈ జిల్లా నుంచి తమిళనాడు రాష్ట్రానికి సరుకుల రవాణా అంతా అప్పట్లో సముద్ర తీర ప్రాంతం నుంచే జరిగేది. తడ మండలం నుంచి, ఇటు సూళ్ళూరుపేట, కోట, వాకాడు, కోట, ముత్తుకూరు, తోటపల్లి గూడూరు, ఇందుకూరుపేట, విడవలూరు, అల్లూరు, బోగోలు, కావలి మండలం దాకా వున్న ఈ సముద్రతీరప్రాంతాన్ని వినియోగించుకుంటే, ఒక పెద్ద పారిశ్రామిక కారిడార్‌గా ఉపయోగపడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అందులోనూ ముత్తుకూరు మండలంలో అత్యద్భుతమైన కృష్ణపట్నం ఓడరేవు వుంది. ముత్తుకూరులో, రాష్ట్రంలోనే ఏకైక మత్స్య కళాశాల ఇక్కడే వుండడం మరో విశేషం. భవిష్యత్తులో కోట మండలంలో దుగరాజపట్నం ఓడరేవు వస్తుంది. సముద్రతీర ప్రాంతాలను అభివృద్ధి చేసుకోగలిగితే ఈ జిల్లా ప్రగతికి ఇక తిరుగే వుండదు. సముద్రతీర ప్రాంతాల్లో ఇటీవలి కాలంలో బాగా విస్తరించిన రొయ్యలసాగుతో, ఆక్వారంగంలోనూ జిల్లా ముందంజలో వుంది. అటు పర్యాటక రంగంలోనూ జిల్లా విశేష ప్రాధాన్యతనే సంతరించుకుంది. ఎంతో విశాలమైన పులికాట్ సరస్సు, పక్షులకు ఆటపట్టయిన నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం, మైపాడు, ఇందుకూరుపేట, రామతీర్థం, కోట-వాకాడుల్లో బీచ్‌లు వున్నాయి. మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలోనూ ఎంతో చరిత్రాత్మకమైన ఉదయగిరి దుర్గం వుంది. ఇవన్నీ పర్యాటకులకు కనువిందు చేస్తుంటాయి. అంతేకాదు, అనేకరకాలైన అపూరూపమైన, అమూల్యమైన ఖనిజ నిక్షేపాలకూ జిల్లాలో కొదవ లేదు. గతంలో గూడూరు, సైదాపురం ప్రాంతాల్లో అత్యంత విలువైన అభ్రకం గనులున్నాయి. ఇప్పట్లో అవి చాలావరకు మూతపడిపోయాయి. అభ్రకమే కాక, అనేక రకాలైన ఖనిజ వనరులకు కూడా కొదవ లేదు. అటు పారిశ్రామికంగానూ, ఇటు వ్యవసాయపరంగానూ, పర్యాటక పరంగానూ అభివృద్ధికి అవసరమైన అన్ని వనరులూ జిల్లాలో కొదవ లేకుండా వున్నాయి. పాడిపరిశ్రమ రంగంలోనూ అనేకమంది ఆధారపడి జీవిస్తున్నారు. పాల ఉత్పత్తులకు ఏ లోటూ లేని జిల్లా ఇది. ఉదయగిరి, వెలిగొండల వంటి కొండ ప్రాంతాలు, విస్తారమైన అడవులతో జిల్లా అనేకమైన సహజ వనరులతో నిండివుంది. అయితే, ఉన్న వనరులను ఎలా ఉపయోగించుకుని జిల్లా ప్రగతికి బాటలు వేయాలో ప్రభుత్వం, అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలనలు చేయాల్సివుంది. జిల్లాను అటు పారిశ్రామికంగా, ఇటు వ్యవయసాయపరంగా, మరోవైపు పర్యాటకంగా కూడా అభివృద్ధి చేసుకోవాల్సి వుంది. జిల్లాలో కిసాన్‌సెజ్‌లతో పాటు, వైద్యపరంగా అభివృద్ధికి హెల్త్‌సెజ్‌లు కూడా వృద్ధి చేసుకునే మార్గాలను అన్వేషించాలి. తీరప్రాంతాల్లో పారిశ్రామిక కారిడార్‌లు, మెట్ట ప్రాంతాలు సస్యశ్యామలంగా వుండేందుకు వ్యవసాయాధారిత పరిశ్రమలు విస్తారంగా నెలకొల్పాలి. వెంకటగిరి, పాటూరు ప్రాంతాల్లో ఎన్నో ఏళ్ళ నుంచి ప్రఖ్యాతిగన్న చేనేతకారులు వున్నారు. జిల్లా నుంచి రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి ఖ్యాతినందుకున్న ఎందరో చేనేతకారుల అద్భుత కళానైపుణ్యం వర్ధించనలవిగానిది. చేనేతకారులకు పూర్తి స్థాయిలో చేయూతనివ్వగలిగితే చేనేత రంగంలోనూ జిల్లా ఖ్యాతి మరింత విఖ్యాతి పొందుతుంది. జిల్లాను ప్రగతి పథంలో నడిపించేందుకు అవసరమైన అన్ని వనరులూ పుష్కలంగా వున్న జిల్లా ఇది. నడిపించే సామర్థ్యం, చిత్తశుద్ధి, పట్టుదల వుండాలేగానీ, జిల్లా అన్ని రంగాల్లోనూ సమగ్రాభివృద్ధి సాధిస్తుంది. ఆర్థికరంగం అస్తవ్యస్తమైపోయి, అన్ని రంగాల్లో నిరాశ అలముకుని, ధరలు పెరిగిపోయి, ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గిపోయి, వ్యవసాయం కుంటుబడిపోయి, నిరుద్యోగం పెరిగిపోయి.. ఏళ్ళు గడుస్తున్నా నేటికీ ఎలాంటి అభివృద్ధికీ నోచుకోని ఎంతో మంది పేదకుటుంబాలు తమను ఆదుకునేవారి కోసం ఆశగా ఎదురుచూస్తున్నాయి. సీమాంధ్రలో సింహపురిసీమ ఉరకలెత్తే ప్రగతివైపు పరుగులు తీయాలని ఇక్కడి ప్రజలంతా ఆకాంక్షిస్తున్నారు. మరో రెండు రోజుల్లో సీమాంధ్రకు తొలి ముఖ్యమంత్రిగా, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు పదవీ ప్రమాణస్వీకారం చేస్తున్న నేపథ్యంలో, ఈ జిల్లా అంతా కొత్తప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకుని వుంది. సీమాంధ్రను స్వర్ణాంధ్రగా రూపుదిద్దేందుకు చంద్రబాబునాయుడు అలుపెరుగని కృషి చేస్తారని ఇక్కడి ప్రజానీకం గట్టిగా విశ్వసిస్తోంది. దేశ ప్రగతి ప్రదాత, జనహృదయనేత ప్రధాని నరేంద్రమోడి ఆశీస్సులతో, జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మరో మహానేత ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆత్మీయ సహకారంతో ఈ జిల్లా ఇక ప్రగతిదారిలో శరవేగంగా పయనిస్తుందని అందరూ ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో ఏఏ రంగాలను అభివృద్ధి చేస్తే ప్రజలకు మరింత ప్రగతి ఫలాలు అందించగలమో పాలకులు, ప్రభుత్వం దృష్టిసారించాలని, సరైన నిర్ణయాలతో జిల్లాను ప్రగతిదారిలోకి మళ్ళించాలని అందరూ కోరుకుంటున్నారు. సీమాంధ్రలో సింహపురి ప్రగతిరథం పరుగులు తీయాలని, అభివృద్ధి పథంలో నెల్లూరుసీమ అగ్రగామిగా వుండాలని అందరూ ఆకాంక్షిస్తూ, కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజలు మనసారా శుభాశీస్సులు పలుకుతున్నారు.

# ఆన్‌లైన్‌లో అర్జీల పరిష్కారం

- జూన్1 నుంచి చౌకదుకాణాల అక్రమాలకు చెక్
- టోల్‌ఫ్రీ నెం. 1800-4252499

ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చే అర్జీల పరిష్కారానికి ఆన్‌లైన్ విధానం కలెక్టరేట్‌లో ప్రవేశపెట్టడం జరిగిందని జాయింట్ కలెక్టర్ శ్రీమతి జి.రేఖారాణి పేర్కొన్నారు. మే 31వ తేదీ కలెక్టరేట్‌లో ప్రజావిజ్ఞప్తుల హాలులో పౌరసరఫరాలు మరియు ప్రజావిజ్ఞప్తులకు సంబంధించిన అంశాలపై జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాలకు చెందిన ప్రజలు తమ ప్రాంతాల్లో వివిధ సమస్యలపై అధికారుల వద్ద పెండింగ్‌లో వుండి పరిష్కారం కాకుండా జిల్లా కేంద్రం కలెక్టర్ కార్యాలయంలో అందజేసిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అర్జీలు ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టి అమలు చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. అలాగే నిత్యావసర వస్తువులు సక్రమంగా పంపిణీ చేసేందుకు, అందుకు సంబంధించిన సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకొని పరిష్కరించేందుకు కలెక్టర్ కార్యాలయంలో కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, కాల్‌సెంటర్ టోల్‌ఫ్రీ నెం. 1800 – 425–2499కు ఫోన్ చేయవచ్చన్నారు. ఈ కాల్‌సెంటర్ ఉ॥ 10.00గం. నుండి రాత్రి 9.00గం.వరకు పనిచేస్తుందని ఆమె తెలిపారు. రేషన్‌షాపుల నుండి నిత్యావసర సరుకులు సక్రమంగా లబ్ధిదారులకు అందజేస్తు న్నారా? ఎవరైనా బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్నారా? తదితర సమస్యల గురించి కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసి సమాచారం తెలుపవచ్చునన్నారు. వచ్చిన సమస్యలపై 24గంటల లోపల పరిష్కరించేలా చర్యలు తీసుకొంటామన్నారు.

జిల్లాలో 2.30లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, అందులో 90శాతం సేకరించి రాష్ట్రంలో జిల్లా ప్రథమస్థానంలో వచ్చిందని ఆమె తెలిపారు. తొలుత కాల్‌సెంటర్ మరియు ప్రజావిజ్ఞప్తుల ఆన్‌లైన్ విధానంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సాంకేతిక నిపుణులు నాగేశ్వరరావు వివరించి తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.వి.నాగేశ్వరరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీమతి శాంతకుమారి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ధర్మారెడ్డి, డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున, సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఈత సరదాయే!..కానీ ప్రాణాలు జాగ్రత్త!

## చెరువులు దొరువుల్లో.. నీటిగుంటల్లో పొంచివున్న మృత్యువు



మండే ఎండల కాలం వస్తే పెద్ద వాళ్ళకు ఎంతో ఇబ్బందిగా వుంటుంది కానీ, పిల్లలకు మాత్రం ఇదే పెద్ద ఆట విడుపు. అందులోనూ పల్లెల్లో పిలగోళ్ళకి భలే సరదా!..కాలువలు, చెరువులు కని పిస్తే చాలు, బుడుంగున ఈతకు దిగేయా లనిపిస్తుంది. దిగుడుబావుల్లో నీళ్ళు ఎంత లోతుగా వున్నా సరే, వెనుకా ముందూ చూడకుండా దూకేయడమే!..ఈత మీద వున్న సరదా అలాంటిది. అయితే, ఈత వచ్చు కదా అని ఎక్కడంటే అక్కడ మునిగితే, ఇక తేలే అవకాశం కూడా వుండదని గుర్తుంచుకోవాలి. పిల్లలు తగు జాగ్రత్తలో లేకపోతే, పెద్దవాళ్ళకి ఇక గర్భశోకమే మిగు లుతుంది. సెలవులు వచ్చాయి కదా అని పెద్దవాళ్ళకి తెలియకుండా ఏ నీటిగుంట లోనో దిగితే, ఇక పైకి రాలేకపోవచ్చు. మృత్యువు ఎక్కడ పొంచి వుంటుందో ఎవరికి తెలుసు?.. జిల్లాలో గత వేసవిలోనూ అనేకమంది పిల్లలు, యువకులు కూడా నీటిగుంటల్లో దాగిన మృత్యురాకాసి కరకు కోరలకు బలైపోయిన సంఘటనలు బోలెడు. మొన్నటి ఆదివారం బంధువుల పెళ్ళికోసమని వచ్చి, సోమశిల జలాశయం వద్ద ఈతకు దిగి ముగ్గురుని మృత్యువు మింగేసింది. కలువాయి స్వస్థల మైనప్పటికీ, జీవనోపాధి కోసం వెళ్ళి బెంగుళూరులో స్థిరపడిన నాగరత్నమ్మ– శ్రీనివాసులు దంపతులు సరదాగా సోమశిల జలా శయం వద్దకు వచ్చి, ఈతకు దిగి లోతుకు వెళ్ళిపోయారు. వీరి కేకలు విని రక్షించే దుకు చేయందించిన వారి బంధువైన స్వాతి అనే 13 ఏళ్ళ బాలిక కూడా నీట మునిగిపో యింది. ఇలా ప్రమాదం వున్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు వుండివుంటే, ముగ్గురి ప్రాణాలు పోయివుండేవి కాదు కదా?.. అని స్థానికులు ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు. జలాశయం వంటి ప్రాంతాలే కాదు, నీటి గుంతల్లో ఈత కూడా ప్రాణాంతకంగానే మారింది. ఇసుక కోసమో.. మట్టి కోసమో చెరువులు, దొరువులను కొంతమంది అడ్డదిడ్డంగా తవ్వేయడం వల్ల ఏర్పడిన గుంతలు కూడా, ఒక్కోసారి చివరికి అభంశుభం తెలియని చిన్నారుల ప్రాణాల మీదికి వస్తుంటుంది. కానికాలం వస్తే కర్రే పామై కరుస్తుందని సామెత. కనుక, ఎందుకైనా మంచిది.. పిల్లలు ఈ వేవి సెలవుల్లో ఎక్కడికి వెళ్తున్నారో ఏమిచేస్తున్నారో పెద్దలు జాగ్రత్తగా ఒక కన్నేసి వుంచాలి. లేకుంటే ప్రమాదాన్ని కొనితెచ్చు కున్నట్లే. ఇదే సందర్భంలో, ఈత కొట్టేందుకు ప్రమాదకరంగా వున్న ప్రాంతా లను ఆయా ప్రాంతాల్లోని అధికార సిబ్బంది కూడా వెంటనే గుర్తించి, అక్కడంతా 'ఈ ప్రాంతం ప్రమాదకరం ఈతకు దిగరాదు'– ఇక్కడ ఈత నిషేధం–మృత్యువు పొంచి వుంది జాగ్రత్త'..అని రాసివున్న బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల కొంత మేరకు ప్రమాదాలను అరికట్టవచ్చుననే అభిప్రా యాలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అధికా రులు, సిబ్బంది ఆ మేరకు చర్యలు తీసుకో వాలి. ఇలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని గ్రామప్రాంతాల్లో పనిచేస్తున్న సిబ్బందికి జిల్లా ఉన్నతాధి కారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తే కొంత ప్రయోజనం వుంటుంది. అంతే కాక, పిల్లలు ఏ కాలువలోనో ఈత కొడు తుంటే ఎవరైనా చూసినా, వారిని హెచ్చ రించి ఇళ్ళకు పంపేయాలి. దిగుడు బావుల్లో ఈత మరింత ప్రమాదకరం. బావుల్లో ఈతకు దిగకూడదని పెద్దలు పిల్లలకు గట్టిగా జెప్పాలి.

పిల్లలు ఈ వేసవిలో ఎక్కడికి వెళ్తున్నారో గమనించి, పిల్లలు ఇలాంటి ప్రమాదాల బారినపడకుండా తల్లిదం డ్రులు ఎంతో అప్రమత్తంగా వుండాల్సిన సమయం ఇది. పిల్లలు సరదాగా తమ స్నేహితులతో నదుల్లో స్నానాలతో, సముద్రస్నానాలకు వెళ్ళేటప్పుడు కూడా పెద్దలు అన్ని ముందు జాగ్రత్తలూ తీసుకో వాలి!.. తీరా ప్రమాదం జరిగిన తర్వాత ఎంత రోదించినా ప్రయోజనం ఏముం టుందీ?... కనుక తస్మాత్.. జాగ్రత్త!

# యం.ఐ.యం ఉచిత ఖత్నా



యంఐయం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్‌రవూఫ్ ఆధ్వర్యంలో జూన్ 2న నెల్లూరులో ఉచిత ఖత్నా(ఒడుగులు) కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఉదయం 7గంటలకు ప్రారంభమైన కార్యక్రమంలో 198మంది చిన్నారులకు ఖత్నా చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నెల్లూరు నగర, గ్రామీణ శాసనసభ్యులు డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, లేబర్ బీడీ అధినేత జమాలుల్లా పాల్గొని గోధుమలు, చక్కెర, మందులు చిన్నారులకు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో ఖత్నా ఆర్గనైజర్ షేక్ రియాజ్, డాక్టర్ మహమూద్, ముస్లింయూత్ అధ్యక్షుడు షేక్ ఖాలిద్ అన్వర్, ప్రధాన కార్యదర్శి హమీద్ హుస్సేన్, జమీర్, కరీముల్లా, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

# చోరీలను అరికట్టండి

నగరంలో దొంగతనాలు ఎక్కువవుతున్నాయని, వాటిని అరికట్టడానికి ప్రత్యేక చొరవ చూపాలని నగర డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి నగర పోలీసు అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో నగర సిఐలు, ఎస్‌ఐలు, సీసీఎస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో కూడా గొలుసు దొంగతనాలు, పగలు, రాత్రి చోరీలు ఎక్కువవ్వాయని, నిందితులను పట్టుకునేందుకు నిఘా పెట్టాలని ఆదేశించారు. బ్లూకోల్ట్, రక్షక్, క్రైం పార్టీలను పోలీసుస్టేషన్ పరిధిలో ఉదయం నుండి సాయంత్రం 7గంటల వరకు తిప్పాలని, రాత్రి 8గంటల తర్వాత బీట్లను పెంచి పూర్తిస్థాయిలో గస్తీని ముమ్మరం చేయాలన్నారు. సీసీఎస్ పోలీసులు సైతం రాత్రిపూట గస్తీలకు వెళ్లాలని ఆయన సూచించారు.

# పొగాకు వ్యతిరేక దినోత్సవం

## జెవివి ఛాయాచిత్ర ప్రదర్శన

మే 31వ తేదీ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నెల్లూరు గాంధీబొమ్మ కూడలిలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పొగతాగడం వల్ల కలిగే నష్టాలు, అనారోగ్యం గురించి ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు డాక్టర్ బి.రాజేశ్వరరావు మాట్లాడుతూ పొగత్రాగేవారే కాకుండా పక్కనున్న వారు కూడా ఊపిరితిత్తుల రోగాల బారినపడి 6లక్షల మంది దాకా ప్రపంచవ్యాప్తంగా మరణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రెడ్‌క్రాస్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ ఈదూరు సుధాకర్ మాట్లాడుతూ పొగ తాగడం వల్లే కాకుండా పొగాకు ఉత్పత్తులు నమలడం వల్ల వచ్చే క్యాన్సర్, టి.బి. వ్యాధులు గురించి తెలిపారు. జనవిజ్ఞానవేదిక నగర అధ్యక్షులు డాక్టర్ శ్రీనునాయక్, కార్యదర్శి డాక్టర్ ఓ.రాజేష్, ఆరోగ్య కమిటీ కన్వీనర్ డాక్టర్ ఖాదర్‌బాషా, ఎంజీ బ్రదర్స్ ఎండి గంగాధరం, మేనేజర్ సుందరం తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాసుపత్రికి ఆధునిక సొగసులు



నెల్లూరులోని దొడ్ల సుబ్బారెడ్డి ప్రభుత్వ ప్రధానవైద్యశాలను ఆధునికీకరించే పనులను చేపట్టారు. ఇంతకాలంగా ఈ ఆసుపత్రి ఓ బందెలదొడ్డి మాదిరిగా వుంటూ వచ్చింది. దిక్కుదిశాణం లేని వాళ్ళు తప్పితే ఇంకెవరూ ఇక్కడకు వైద్యం కోసం వచ్చేవాళ్లు కారు. సకల అవలక్ష ణాలతో ఈ ఆసుపత్రి ప్రతిరోజూ పేపర్లకు ఎక్కుతూనే వుండింది. అయితే ఆసుపత్రి ప్రాంగణంలోనే ప్రభుత్వ వైద్యకళాశాలను నిర్మిస్తుండడంతో ఆసుపత్రికి పట్టిన దరిద్రం వదిలినట్లయ్యింది. పెద్దాసుపత్రిని వైద్య కళాశాలకు అనుసంధానించారు. దీంతో పెద్దాసుపత్రి సూపర్‌స్పెషాలిటీ సొకులను సంతరించుకుంటుంది.

పెద్దాసుపత్రిలో ప్రస్తుతం ఉన్న అన్ని విభాగాలను మార్చి వాటి స్థానంలో అత్యాధునిక పరికరాలతో సూపర్‌స్పెషాలిటీ విభాగాలను ఏర్పాటు చేసే పనులు మొదలయ్యాయి. అలాగే అన్ని వార్డులలో వున్న పడకలను ఆధునీకరి స్తున్నారు. గుండె, ఊపిరితిత్తులు, కాలేయం వంటి సూపర్‌స్పెషాలిటీ విభాగాల ఏర్పాటుకు శ్రీకారం చుడుతున్నారు.

### పాఠక మహాశయ మానసపుత్రిక
## "లాయర్"కు దీర్ఘాయుష్మాన్‌భవ

పాఠక జనహృదయాలను హత్తుకునేలా అక్షర సుమాలను వెదజల్లుతూ
పాత్రికేయ విలువలను మనసా, వాచా, కర్మణా పాటిస్తూ
సింహపురి సమాచారాన్ని విశ్వవ్యాప్తం చేస్తూ
అక్షర సమరంలో అలుపెరగని పోరాటం చేస్తూ
అక్రమార్కుల పాలిట సింహస్వప్నమై గర్జిస్తూ
రాజకీయ జోకర్లను, బ్రోకర్లను చీల్చి చెండాడుతూ
ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ
కల్పిత మాటలతో ప్రజాసొమ్మును దోచుకుంటున్న ధనమదాంధులకు "గల్పిక"తో
చీవాట్లు పెడుతూ
వార్తావంటకాలను వండివార్చడంలో గంగా ప్రవాహంలా పరవళ్ళు తొక్కుతూ
33వసంతాల దిగ్విజయ పరంపర అప్రతిహతంగా సాగిస్తూ
పాలకుల పాపాలను కడిగేస్తూ - సప్తవర్ణాల మేలిమి కాంతుల పుటలతో
సర్వజనులను అబ్బురపరుస్తూ
"ప్రజావాణి" శీర్షికతో జనగళాన్ని నినదింపజేస్తూ
"కదంబం" శీర్షికతో కవుల కలాలకు పదును పెడుతూ
ఆధ్యాత్మికతను గుబాళింపజేస్తూ
వారపత్రికల్లో సాటిలేని మేటి ఆయుధంగా భాసిల్లుతూ
నెల్లూరు ముదురు దోమల వీరవిజృంభణ ప్రతాపాన్ని ప్రపంచానికి చాటిచెబుతూ
సమస్యల వాదనలో "న్యాయవాద" (లాయర్) భూమిక పోషిస్తూ
పత్రికారంగంలో తిరుగులేని వజ్రాయుధంగా దూసుకుపోతున్న
"తుంగా" వంశ మానసపుత్రిక "లాయర్"కు జయాభవ...
దిగ్విజయీభవ..దీర్ఘాయుష్మాన్‌భవ!
"రాజగోపాలుని" సమున్నత ఆశయ సాధనలో
"శివప్రభాత్" లక్ష్యదిశను అధిగమించాలని ఆకాంక్షిస్తూ... అభిలషిస్తూ... ఆశిస్తూ... నిర్దేశిస్తున్నమ్ము.

ప్రసాద్ ఎస్.వి.కె., సెల్. 99498 43105, నెల్లూరు.

శ్రీను గల్పిక

# కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు

అది ఢిల్లీలోని టెన్‌జనపథ్. సార్వత్రిక ఎన్నికల తర్వాత ఆరోజే అక్కడ కోలాహలంగా వుంది. ఓ చోట షామియానాలు వేసి పాతికమంది వంటమనుషులు రకరకాల వంటలు వండుతున్నారు. పలు రకాల స్వీట్లు తయారు చేస్తున్నారు. అక్కడ వంటకాల ఘుమఘుమలకు వస్తున్న వారి నోర్లు వూరిపోతున్నాయి. వి.హెచ్.హనుమంతురావు, సర్వే సత్యనారాయణ, మధు యాష్కీలు అక్కడ వంట ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వి.హెచ్.హనుమంతరావు కొత్తిమీర, కరివేపాకు తురిమి వారికి ఇస్తుంటే, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి కొబ్బరిని తురిమి అందిస్తున్నాడు. మాజీప్రధాని మన్మోహన్‌సింగ్, ఏ.కె.ఆంటోనీ, గులాం నబీ ఆజాద్, చిదంబరం, కమల్‌నాథ్, పనబాక లక్ష్మి, మనీష్ తివారి, దాసరి జైరాంరమేష్, సుశీల్‌కుమార్ షిండే వంటి నాయకులంతా ఒక్కొక్కరుగా తమ కార్లలో వచ్చారు. దిగ్విజయ్‌సింగ్ మాత్రం తన కొత్త ప్రియురాలిని ఎక్కించుకుని పల్సర్ 150సిసి బైక్‌పై రయ్‌మని దూసుకువచ్చాడు. నిన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోయిన బాధలో వున్న సోనియాగాంధీని పరామర్శిద్దామని స్టైల్ ఆఫ్ సింహపురి, మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి(64) కూడా అక్కడకు వచ్చాడు. అక్కడ వేసిన షామియానాలు, వంటలు వండడం చూడగానే వివేకా ముఖంలో సంతోషం కనిపించింది. ఆయనే నేరుగా హాల్‌లోకి వెళ్లాడు. అక్కడ సోనియా, రాహుల్‌ల చుట్టూ కాంగ్రెస్ నాయకులంతా ఉన్నారు. వివేకా నేరుగా రాహుల్ చేయి పట్టుకుని ఊపుతూ... కంగ్రాట్స్ పెళ్లి కొడకా... ఇప్పటికన్నా పెళ్లి చేసుకోవాలనే ఆలోచన వచ్చింది నీకు, ఇప్పుడుగాని పార్టీ గెలిచి ప్రధానివై ఉంటే నీకు ఈ పెళ్లి యోగం ఉండేది కాదు, జీవితాంతం నాలా గోడలు దూకే పనిలోనే ఉండేవాడివి... ఇప్పటికైనా ఓ ఇంటివాడివవుతున్నందుకు కంగ్రాట్స్, ఎంతకాలమని ఆ ఫాంహౌస్‌లో తంటాలు పడుతావు అంటూ సోనియా వైపు తిరిగి... ఇప్పటికైనా అబ్బాయికి పెళ్లి చేయాలనుకున్నారు. చాలా సంతోషం మేడమ్, అమ్మాయిది మన ఇండియానేనా, లేక ఇటలీలో మీ బంధువులమ్మాయిలనెవరినైనా చూసారా అని అడిగాడు. వివేకా మాటలతో సోనియా, రాహుల్‌లు నోర్లు తెరచుకోగా, మిగతా నాయకులంతా వారివైపు కోపంగా చూస్తున్నారు. మన్మోహన్‌సింగ్ వుండి... ఏం మేడమ్, మేము అంత కానివాళ్లమైపోయామా... అబ్బాయి పెళ్లి విషయం మాతో ఒక్క మాట కూడా చెప్పలేదని నిష్టూరపడ్డాడు. దాసరి జైరాంరమేష్ వుండి... ఏంటి మేడమ్, ఎంత ఒకవేళ పార్టీ అధికారంలోకి రాకపోతే మాత్రం రాహుల్ పెళ్లిని అంత రహస్యంగా చేయాల్నా, మాకు చెబితే మేమూ పెళ్లి పనుల్లో తలో చేయి వేస్తాంగా... అయినా ఢిల్లీలో వున్న మాకు తెలియని రాహుల్ పెళ్లి విషయం, నెల్లూరులో ఉన్న వివేకాకు ఎలా తెలిసిందని అడిగారు. ఆ మాటలకు సోనియాకు చిర్రెత్తింది. రాహుల్‌కు పెళ్లని నీకెవరు చెప్పారని వివేకాను అడిగింది. బయట షామియానాలు వేసి, వంటవాళ్లు వంట లొండుతుంటే అబ్బాయి పెళ్లి భోజనాలనుకున్నాను... అని చెప్పాడు. ఆ మాటకు సోనియా... నీ తెలివి తెల్లారినట్లే వుంది. నీ మాటలతో అనవసరంగా వీళ్లంతా నన్ను అపార్థం చేసుకున్నారు. అవి పెళ్లి భోజనాలు కాదు, మీ అందరికీ విందు భోజనాలు. మన పార్టీ విజయం సాధించింది కదా... అని చెప్పి నేరుగా వేదిక మీదకు వెళ్లింది. మన పార్టీ గెలిచిందా... ఎక్కడ? అని వివేకా కళ్లద్దాలు తీసి ముక్కుమీద వేలేసుకుని ఆశ్చర్యపోతుండగా... సోనియా, రాహుల్, మన్మోహన్‌సింగ్‌లు వేదికమీద కూర్చున్నారు. మొదట దిగ్విజయ్‌సింగ్ వేదికనెక్కి.. ఈరోజొక శుభదినం. మన పార్టీకి మరణం లేదని ఈ ఎన్నికలు నిరూపించాయి. కేంద్రంలో గత 5ఏళ్లపాలనను ఒక ప్రయోగంగా నిర్వహించాం. ప్రపంచ చరిత్రలో ఏ దేశంలో ఏ ప్రభుత్వమూ చేయనంతటి నీచ, నికృష్ట పాలన మనం చేసాం. ఇది కావాలనే చేసాం. ఇదే పాలన ఇంకే దేశంలోనన్నా చేసివుంటే అక్కడి ప్రజలు ఆ పాలకులను ఆ దేశం నుండి తన్ని తరిమేసుండేవాళ్లు. అంతెందుకు ఈమధ్యనే చూసాం కదా... లిబియా, సుడాన్ వంటి దేశాలలో ఏం జరిగిందో... వారికంటే కూడా మనం దరిద్రంగా పరిపాలించాం... అయితే ఈ దేశ ప్రజలు కాంగ్రెస్‌పార్టీకి 44లోక్‌సభ సీట్లు ఇచ్చారంటే మనం ఇంకా ప్రజల గుండెల్లోనే ఉన్నామని చెప్పడానికి నిదర్శనమని చెప్పి కూర్చున్నారు. తర్వాత షిండే వేదికనెక్కి... కాంగ్రెస్‌పార్టీ ఎంత గొప్పదో చెప్పడానికి సీమాంధ్రలో వచ్చిన ఫలితాలే ఉదాహరణ. మనం చేసిన రాష్ట్ర విభజన తీరును చూసి సిగ్గు, శరం వున్నోళ్లయితే కాంగ్రెస్‌కు ఓట్లేయరు. కాని సీమాంధ్రలో మన పార్టీ అభ్యర్థులకు కూడా అక్కడక్కడా వందల్లో, కొన్ని చోట్ల వేలల్లో ఓట్లు వచ్చాయంటే ఖచ్చితంగా అది మన పార్టీ గొప్పతనమే అని చెప్పి దిగాడు. తర్వాత కమల్‌నాథ్ వేదికనెక్కి.. పార్లమెంటులో విభజన బిల్లు పెట్టేటప్పుడు సీమాంధ్ర ఎంపీలను తన్నించినా కూడా అక్కడ మనకు ఓట్లు పడ్డాయంటే భవిష్యత్ మన పార్టీదేనని అర్థమవుతుందన్నారు. తర్వాత వీరప్పమొయిలీ వేదికనెక్కి.. మనం ఐదేళ్లు ఇంత ఛండాలంగా పరిపాలించాక కూడా కాంగ్రెస్‌కు 44లోక్‌సభ సీట్లు వచ్చాయంటే అది రాహుల్‌బాబు ప్రచారం చేయడం వల్లేనని చెప్పారు. చివరగా సోనియాగాంధీ లేచి... మన మన్మోహన్‌సింగ్‌లాగా నరేంద్ర మోడీని 5ఏళ్లు చచ్చు సన్నాసి ప్రభుత్వాన్ని నడపమనండి... అప్పుడు వారికి మనలాగా 44సీట్లు కాదు కదా... 4సీట్లు కూడా రావు... ఛాలెంజ్ అంటూ సవాల్ విసిరింది. ఆ ఛాలెంజ్‌ను చూసి అందరూ మురిసిపోయి చప్పట్లు చరిచారు. అదంతా చూస్తున్న వివేకాకు సోనియా ఛాలెంజ్ నిజమేననిపించింది. ఇంత ఛండాలంగా ప్రభుత్వాన్ని నడిపాక కూడా కాంగ్రెస్‌కు కాబట్టే 44 సీట్లొచ్చాయి. అదే ఇంకో పార్టీకైతే రావనిపించింది. అందరితో పాటూ వివేకా కూడా భోజనానికి లేచాడు.

కదంబం

## నిజం

కె.వి.నాగేశ్వరరావు,
కోవూరు. 93939 99449.

ఈనాడు రాని విప్లవం
రేపైనా రాకపోదు!
ఈనాడు వర్షించని మేఘం
ఇంకోనాడైనా వర్షించకపోదు!
ఈనాటి నిశ్శబ్దం నుంచే
ఏదో ఒక రోజున పుడుతుంది శబ్దం!
సరియైన విత్తనం
ఎప్పటికైనా మొలకెత్తకపోదు!
అప్పటిదాకా
ఎదురుతెన్నులు తప్పవు!
కష్టాలు తప్పవని తెలిసినా
కన్నీరు కురవడం ఆగదు!
కన్నీరు మున్నీరైనా
కష్టాలు మాత్రం కరిగిపోవు!
స్వప్నాలు ఫలించకున్నా
కలతనిద్దుర తప్పదు!
నిదురరాని కన్నుల నుండే
వెలుగుతుంది విప్లవ జ్యోతి! ఇది నిజం!!



కళాదీప్తి సంస్థ తరపున మోపూరు పెంచల నరసింహంకు 'కవితాప్రవీణ' బిరుదును ప్రదానం చేస్తున్న ఏ.జె.సి రాజ్‌కుమార్, కొండా బలరామిరెడ్డి తదితరులు

## విలక్షణంగా "బామా" సినీ సంగీత విభావరి

కావలి పట్టణంలోని కార్పొరేషన్ రీడింగ్ రూమ్ ప్రాంగణంలో జూన్ 1న బాలసుబ్రహ్మణ్యం ఆర్ట్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ (బామా) సామాజిక సాంస్కృతిక సేవాసంస్థ నిర్వహణలో ప్రముఖ సినీ నేపథ్యగాయకులు నెల్లూరీయులు పద్మభూషణ్ ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం 69వ పుట్టినరోజు సందర్భంగా సినీ సంగీత విభావరి జరిగింది. గాయకులు రోహిత్ (హైదరాబాద్), భాస్కర్ (హైదరాబాద్), విష్ణుప్రియ(తణుకు) బిందు (ఏలూరు)లు రసరమ్యంగా సినీగీతాలు ఆలపించి అందరినీ అలరించారు. బామా వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, కార్యదర్శి లేబాకుల సుధాకర్‌రెడ్డి, ఆర్గనైజర్ బాలాజీలు గాయకుల్ని గౌరవంగా సత్కరించారు. రఫీ అండ్ పార్టీ వాయిద్య సహకారంతో సినీ సంగీత విభావరి విజయవంతం కాగా సౌండ్ అండ్ లైటింగ్ సౌకర్యం జి.శేషారెడ్డి నిర్వహించారు. బామా సభ్యులు శివప్రసాద్, సుబ్బారావు, నరసింహారావు, చిన్ని నాగేశ్వరరావు, విశ్వనాథుని చిన్నా, వెంకట్రామయ్య, పిండెం చంద్రశేఖర్, కొత్తూరు కృష్ణమోహన్‌లు కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్నారు.

### వైభవంగా మహాలక్ష్మీదేవి ఆలయంలో...

## శ్రీనివాస కల్యాణం



నెల్లూరు ఉస్మాన్‌సాహెబ్ పేటలోని బాబా గిరిజన కాలనీలో గల మహాలక్ష్మి దేవస్థానంలో మే 31న శ్రీనివాస కల్యాణం వైభవంగా జరిగింది. దేవాలయం కట్టి ఏడాది కావడంతో పూజారులు కనుమళ్ల సత్యనారాయణశర్మ, మాచవోలు శ్రీనివాసశర్మ, పంచాఙ్గుల వెంకటకృష్ణ మూర్తిల నేతృత్వంలో ఉభయదాతలు దాసరి మాలకొండయ్య నాయుడు, అనూరాధ, మనుజిత్ చౌదరిల సహకారంతో ఉదయం పూజలు, అభిషేకం, దీక్షాహోమం, నిత్య బలిహరణం, కల్యాణోత్సవాలను శాస్త్రోక్తంగా వేదపండితులు నిర్వహించారు. రాత్రి పవళింపుసేవ, మంగళహారతులు ఇచ్చారు. భక్తులు విరివిగా పాల్గొని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణాన్ని తిలకించారు.

## స్మైల్‌లో హెల్త్‌కార్డ్ ద్వారా ఉచిత వైద్యం




నెల్లూరు రమేష్‌రెడ్డి నగర్‌లోని స్మైల్ సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాలకు ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్టు వారిచే గుర్తింపు లభించిన సందర్భంగా ఈనెల 4న ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో హాస్పిటల్ అధినేత డా॥జి.కిరణ్ మాట్లాడారు. గత 15సం॥లుగా నెల్లూరు జిల్లా ప్రజలకు దంత వైద్యరంగంలో విశిష్ట సేవలు అందించి జిల్లాలోనే అగ్రగామిగా ఎదిగామని అన్నారు. "స్మైల్" దంత వైద్యశాలకు "ఉద్యోగశ్రీ" గుర్తింపు లభించడం ఆనందదాయకమని అన్నారు. ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్టు వారి నమూనాలోని అన్ని రకాల దంత చికిత్సలు తమ హాస్పిటల్ ద్వారా పొందాలని డాక్టర్ కిరణ్ లబ్ధిదార్లకు పిలుపునిచ్చారు. తమ హాస్పిటల్‌లో అత్యాధునిక ల్యాబ్, అనుభవజ్ఞులైన టెక్నీషియన్లు, అన్ని రకాల దంత సమస్యలకు సంబంధించిన స్పెషలిస్టు డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది మరియు ఇన్‌పేషంట్స్ సౌకర్యం సైతం ఉండడంతో తమకు ఈ గుర్తింపు లభించిందని అన్నారు.

ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు మరియు రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు కన్సల్టేషన్ నుండి అన్ని రకాల దంత వైద్య చికిత్సలు పూర్తి ఉచితంగా చేయించుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం జారీచేసి ఉన్న తాత్కాలిక హెల్త్‌కార్డుల ద్వారా వైద్యం పొందవచ్చని అన్నారు. పళ్ళులేని వారికి అత్యాధునిక జెర్మోనియం ఇన్‌ప్లాంట్ ఫిక్స్‌డ్ పళ్ళు, చిగుళ్ళ సమస్యలతో బాధపడేవారికి ఫ్లాప్ సర్జరీ మరియు 100రకాలకు పైగా దంత చికిత్సలు పొందవచ్చని వివరించారు.

## సోనియాను కలిసిన కార్తికేయరెడ్డి

ఆనం కుటుంబంలో నాలుగోతరం నాయకులు తయారవుతున్నారు. నెల్లూరు రూరల్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ ఆనం విజయకుమార్‌రెడ్డి కుమారుడు కార్తికేయరెడ్డి ఇటీవల ఢిల్లీ వెళ్లి ఏఐసిసి అధ్యక్షురాలు సోనియాగాంధీని కలిసారు. అలాగే కాంగ్రెస్ యువనేత రాహుల్‌గాంధీని కూడా కలిసి మాట్లాడారు. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో తన తండ్రి కోసం కార్తికేయరెడ్డి విస్తృతంగానే ప్రచారం నిర్వహించారు.

## మేషం



అశ్విని, భరణి, కృతిక 1 పాదము

వ్యవహారములలో, ఆర్థిక లావాదేవీలలో జాగ్రత్త వహించండి. ఏ విషయంలో కూడా మనస్థిమితముండదు. గాయాలు తగిలే ప్రమాదముంది. చెల్లింపులు సకాలంలో జరుపుతారు. అనుకున్న పనులు కొద్ది ఇబ్బందులతో నెరవేరుతాయి. ఆర్థికస్థితి బాగుండినా కొన్ని ప్రత్యేక అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

స్త్రీలకు అనారోగ్య బాధలుంటాయి. చిన్న వ్యాపారులకు ఆదాయం బాగుంటుంది. ఉష్ణబాధలు, శరీరానికి గాయాలు తగలవచ్చును. అనుకున్న పనులు, ఆగిపోయిన పనులు మరల సవ్యంగా సాగుతాయి. మిమ్మల్ని కాదనుకొన్న వారే మరల మీకు సన్నిహితులౌతారు. వృత్తి వ్యాపారాలలో ఆదాయము ఫరవాలేదనిపిస్తుంది. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వస్తు నష్టం, డబ్బునష్టం ఉంటుంది. అధికారులకు ఉద్యోగులకు బాధ్యతల మార్పు, స్థానచలనం ఉంటుంది. స్త్రీలకు అనారోగ్య బాధలుంటాయి. ఆదాయ వ్యయాలలో తేడాలుండి, ఆర్థిక ఇబ్బందులెదుర్కొంటాయి. వ్యాపార వృద్ధి అవకాశాలు చేజారిపోవచ్చును. వృత్తిపరంగా జీవనము కలవారికి, చిరువ్యాపారులకు రాబడి సంతృప్తికరం. ఆరోగ్యం సరిగా ఉండదు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 06.06.2014 నుండి

తేది. 12.06.2014 వరకు

ఈ వారం మేషంలో శుక్రకేతువులు, వృషభంలో రవి, మిథునంలో బుధగురువులు, కన్యలో కుజుడు, తులలో శనిరాహువులు సింహకన్యతులవృశ్చిక రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

ముహుర్తము: తేది 11 బుధవారము రాత్రి గంట 9.02 మొదలు 11.08లోగా మకరలగ్నమున గృహప్రవేశ, వివాహములు.

**జ్యేష్ఠ మాస శుక్ల పక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 06 | శుక్ర | అష్టమి | ప॥గం.11.20ని॥ |
| తేది. 07 | శని | నవమి | ప॥గం.12.35ని॥ |
| తేది. 08 | ఆది | దశమి | ప॥గం.01.20ని॥ |
| తేది. 09 | సోమ | ఏకాదశి | ప॥గం.01.36ని॥ |
| తేది. 10 | మంగళ | ద్వాదశి | ప॥గం.01.42ని॥ |
| తేది. 11 | బుధ | త్రయోదశి | ప॥గం.12.35ని॥ |
| తేది. 12 | గురు | చతుర్దశి | ప॥గం.11.24ని॥ |

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఉద్యోగార్థులకు చక్కని అవకాశాలు లభిస్తాయి. శుభకార్య నిర్ణయాలలో, ప్రయాణాలలోను శ్రమపడతారు. ఉదర సంబంధ అనారోగ్య బాధలు స్వల్పంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, సమర్థత బాగుంటుంది. ఆదాయం స్వల్పంగా, గతంకంటే పెరుగుతుంది. తొందరపాటు నిర్ణయాలు, సమాధానములు ప్రదర్శించవద్దు. మీ పనులకు ప్రణాళికలు రూపొందించుతారు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి వ్యాపారవర్గాలకు గుర్తింపు, మీకు గౌరవముంటుంది. వృత్తి వ్యాపార వర్గాలకు ఆదాయం బాగుంటుంది. లౌక్యంగా అనుకున్న పనులు నెరవేర్చుకొంటారు. ఆర్థికంగా ఇతరులకు సహాయపడటం, పెట్టుబడులు పెట్టడం వల్ల ఖర్చులు పెరుగుతాయి. అసోసియేషన్లు, కమిటీల సమావేశాలలో మీ సూచనలకు గుర్తింపు, మీకు గౌరవముంటుంది. వైద్యఖర్చులు అదనంగా ఉంటాయి.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆందోళనలు, ఆలోచనలు సర్దుకొని స్థిమితపడతారు. నిరుద్యోగులకు అవకాశాలు మంచివి లభించగలవు. గృహమార్పులు స్థలమార్పులుండగలవు. ఆర్థికపరంగా అభివృద్ధి, వృత్తి వ్యాపారాలను ప్రణాళికబద్ధంగా నిర్వహించడం, ఆదాయం పెరగడం ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు ఆలస్యంకాగలవు. సోదరవర్గానికి సమస్యలుండవచ్చును. సొంత పనులను విజయవంతంగా నిర్వహిస్తారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆత్మీయమిత్ర బంధువర్గముకు అనారోగ్య బాధలుంటాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత తక్కువ. వ్యాపారవృద్ధి అవకాశాలు సన్నగిల్లుతాయి. వచ్చిన ఆదాయం ఏదో ఒక రూపంలో ఖర్చు అవుతుంటుంది. గడిచిపోయిన విషయాలు లేవనెత్తి మాట పట్టింపులు, వివాదాలు బంధువులతో ఏర్పడవచ్చును. దైవకార్యాలలో పాల్గొనడం, గృహమార్పులు ఉండగలవు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

సంప్రదింపులు ఒప్పందాలకు అనుకూల సమయమిది. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలువంటివి కష్టం మీద సంపాదిస్తారు. ఆర్థిక విషయాలలో కొద్ది ఇబ్బందిపడతారు. వ్యాపార అవకాశాలు చేజారిపోవచ్చును. ఆదాయానికి తగ్గట్టు ఖర్చులు సిద్ధంగా ఉంటాయి. బంధువర్గంతో బేధాలు, సూటిపోటి మాటలుపడటం జరుగుతుంది. విద్యార్థులలో ఉత్సాహం నెలకొంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

గృహ నిర్మాణ రంగాలవారు, కాంట్రాక్టర్లకు వర్కర్లతో ఇబ్బందులుంటాయి. ఇతరులు మీపై పరోక్ష విమర్శలు చేస్తారు. బంధువర్గంతో సంబంధాలు బలపడతాయి. వృత్తి ఉపాధి పథకాలలో నిలద్రొక్కుకుంటారు. వ్యాపారములందు పెరుగుదల, ఆదాయం బాగుంటుంది. వ్యాపారాలు, ఆర్థిక వ్యవహారాలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. బాకీల చెల్లింపులు నిలబడిపోతాయి.


## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అనుకున్న పనులను పట్టుదలతో సాధించుకొంటారు. బంధుమిత్రుల రాకపోకలు, పెద్దలతో పరిచయాలుంటాయి. అధికారులకు ప్రమోషన్ స్థానమార్పులుంటాయి. ఆదాయ వ్యయాలు సంతృప్తికరంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది. వివాహ నిర్ణయాలు, అనుకోని ప్రయాణాలుంటాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. తొందరపాటు నిర్ణయాల వల్ల ధనవస్తు నష్టం కలిగే అవకాశం ఉన్నది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

క్రొత్త వ్యాపార ప్రారంభములకు, నూతన పెట్టుబడులకు నిర్ణయాలు గైకొనే అవకాశాలుంటాయి. వాహనాలు నడిపేవారు, యంత్రాలతో, కరెంట్‌తో పనులు చేసేవారు జాగ్రత్తగా ఉండాలి. కుటుంబ వ్యవహారాలను సర్దుబాటు చేసుకొనిపోయే సామర్థ్యమును ప్రదర్శించండి. బంధువర్గంలో ఒకరి అనారోగ్య వార్తవింటారు. అనుకున్న పనులు ఆటంకాలతో జరగడం వల్ల టెన్షన్‌పడుతుంటారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ముఖ్య వస్తువులు, గృహావసరాలను కొనుగోలు చేస్తారు. దూరప్రయాణాలు నిర్ణయంకాగలవు. ఆత్మీయ బంధువులను కలుసుకొంటారు. ఆర్థిక వత్తిడుల నుండి తాత్కాలిక ఉపశమనం లభిస్తుంది. వృత్తి వ్యాపారాలలో వ్యాపకం, అభివృద్ధి బాగుంటుంది. ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులకు ఆటంకాలు వచ్చినా తొలగించుకొని ముందుకు సాగుతారు. ఆరోగ్యం నిలకడగా ఉంటుంది.

# నగర దోపిడీపై విజిలెన్స్ విచారణ

నెల్లూరు నగరపాలక సంస్థలో అడ్డగోలు దోపిడీపై విజిలెన్స్ విచారణ జరిపించాలని తెలుగుదేశం కార్పొరేటర్లు ఉచ్చి భువనేశ్వరప్రసాద్, శైలజలు డిమాండ్ చేసారు. మంగళవారం నగరపాలకసంస్థ కార్యాలయంలోని జనరేటర్ వద్ద కార్పొరేటర్లు, తెలుగుదేశం నాయకులు ధర్నా నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయానికి కరెంట్ కట్ చేసి 20రోజులవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. మున్సిపల్ ఎన్నికలకు ముందు జనరల్ ఫండ్ నుండి 11కోట్ల రూపాయలు డ్రాచేసి కాంట్రాక్టర్లకు బిల్లుల రూపంలో చెల్లించిన అధికారులకు పేరుకు పోయిన కరెంట్ బకాయిలు కట్టాలనే జ్ఞానం లేకపోవడం విచారకరమన్నారు. కార్పొరేషన్ కార్యాలయానికి కరెంట్ నిలిపేస్తే అవమానకరంగా డీజిల్ తగలేస్తూ జనరేటర్‌పై నడిపించడం శోచనీయమన్నారు. త్వరలో తమ పార్టీ అధినేత చంద్రబాబును కలిసి కార్పొరేషన్ అవినీతి మీద విజిలెన్స్ విచారణ వేయాలని కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి రాజేష్‌కుమార్, చంద్ర, బాలాజీ, కళాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# గుక్కెడు నీటి కోసం గుటకలు

**వెంకటేశ్వరపురం కష్టాలివి**

***పక్కనే పెన్నానది ఉంది. అయినా ఎండాకాలం వస్తే ఈ ప్రాంతం ప్రజలకు అవస్థలే!***

నెల్లూరు నగరపాలకసంస్థ పరిధిలోని వెంకటేశ్వరపురం ప్రాంతవాసుల కష్టాలివి. పేరుకు కార్పొరేషన్ పరిధిలో వున్నా, పక్కనే పెన్నా పారుతున్నా ఈ ప్రాంతం వాళ్లు మాత్రం మంచినీటి అవస్థల నుండి బయటపడలేకపోతున్నారు. నెల్లూరంతా పెన్నకు దక్షిణం వైపున ఉంటే వెంకటేశ్వరపురం మాత్రం ఉత్తరంవైపు వుంది. దక్షిణం వైపు పెన్నా తీరంలో భూగర్భజలాలు సమృద్ధిగా వుంటాయి. ఇరవై, ముప్పై అడుగుల్లోనే నీళ్లు పడుతుంటాయి. వెంకటేశ్వరపురం పెన్నాను ఆనుకునే వున్నా బోర్లు వేస్తే నీళ్లు మాత్రం పడవు. వెంకటేశ్వరపురంలో మంచినీటి ఎద్దడిని అరికట్టడానికి సాలు చింతల నుండి పైప్‌లైన్ మంజూరయ్యింది. అయితే ఆ పనులు ఇంకా పూర్తికాలేదు. దీంతో నీటి సరఫరా లేదు. బోర్లలో నీళ్లు అడుగంటాయి. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న నీళ్లు ప్రజల అవసరాలను తీర్చడం లేదు.

# పాలిటెక్నిక్‌లో నేతాజీ ప్రతిభ



డి.గుణశేఖర్

2014 పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారని శ్రీ నేతాజీ ఎం.ఎస్.ఆర్. స్కూలు ప్రిన్సిపాల్ ఎం.వి.సుబ్బారెడ్డి ప్రకటించారు. డి.గుణశేఖర్ 120మార్కులకు గాను 108మార్కులను, యస్.రేవంత్ కుమార్ 99మార్కులు, యం.వి.యస్. శశాంక్ 91మార్కులు సాధించి తమ పాఠశాల ఖ్యాతిని చాటారన్నారు.

తమ కోచింగ్ సెంటర్ నుండి పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష 360మంది రాసిన విద్యార్థులు 350మంది 83% గవర్నమెంటు పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్లు సాధించే ఉత్తమర్యాంకులను సాధించినందుకు గర్వంగా ఉందని, ఉపాధి పొందే సాంకేతిక కోర్సుల్లో చేరి ఉజ్వల భవిష్యత్ పొందాలని విద్యార్థులకు సుబ్బారెడ్డి సూచించారు.

# వియస్‌యులో ఉద్యోగాల భర్తీ

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలో 45మందికి రెగ్యులర్ ఉద్యోగాలు ఇస్తూ ఉపకులపతి ఆచార్యరాజారామిరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేసారు. విశ్వవిద్యాలయంలో ఇప్పటివరకు రెగ్యులర్ ఉద్యోగులు లేరు. ఔట్‌సోర్సింగ్ విధానంలోనే ఇక్కడ ఎక్కువమంది పనిచేస్తున్నారు. ఇటీవల యూనివర్సిటీలో 60పోస్టుల భర్తీకి అధికారులు నోటిఫికేషన్ విడుదల చేసారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్, డిప్యూటీ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, కుక్, డ్రైవర్, వాచ్‌మెన్ వంటి పోస్టులలో 45మందిని నియమించారు. నిబంధనల ప్రకారం అర్హత లేనందున 15పోస్టులను ఇంకా భర్తీ చేయలేదు. ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారికే ఎక్కువుగా రెగ్యులర్ ఉద్యోగులుగా అవకాశమిచ్చినట్లు తెలుస్తుంది.

# భయపెడుతున్న నెల్లూరు వోల్వోలు



మన రాష్ట్రంలోని వోల్వో బస్సులు, కర్నాటక నుండి వచ్చే ఐరావత్ బస్సులతో పోలిస్తే నెల్లూరు వోల్వోబస్సులకు మంచి పేరుంది. ప్రైవేట్ వోల్వోబస్సుల కంటే కూడా సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ వోల్వోబస్సులే మేలనే ప్రచారం వుంది. ముఖ్యంగా నెల్లూరు-బెంగుళూరుల మధ్య నడిచే నెల్లూరు ఓల్వోబస్సులలో టిక్కెట్లకు మంచి డిమాండ్ వుంటుంది. ఇన్నేళ్ళ కాలంలో నెల్లూరు వోల్వోలు పెద్దగా ప్రమాదాలకు లోనైంది కూడా లేదు. అయితే కొంతకాలం క్రితం మహబూబ్‌నగర్‌జిల్లా పాలెం వద్ద జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన వోల్వోబస్సు అగ్ని ప్రమాదానికి గురైనప్పటి నుండి వోల్వో బస్సులెక్కాలంటేనే ప్రయాణీకులు ఒకింత భయపడుతున్నారు. అయినా నెల్లూరు వోల్వోబస్సులకు మాత్రం ఆదరణ తగ్గలేదు. అయితే గత వారంరోజుల్లోనే నెల్లూరుకు చెందిన వోల్వోబస్సులు రెండుసార్లు పెద్దప్రమాదాల నుండి త్రుటిలో బయటపడ్డాయి. ఈ సంఘటనలతో ప్రయాణీకుల్లో కొంత ఆందోళన రేగింది. మొన్న ఒక రోజు రాత్రి 11గంటలకు వోల్వోబస్సు బెంగుళూరు నుండి నెల్లూరుకు బయలుదేరింది. ప్రయాణీకులు గాఢనిద్రలోకి జారుకున్నారు. చివరి వరుస సీట్లలో కూర్చున్న ఓ ప్రయాణీకుడు వెనుకవైపు వున్న ఇంజన్ నుండి పొగలురావడం గమనించి వెంటనే డ్రైవర్ నందగోపాల్‌కు విషయం చెప్పాడు. నందగోపాల్ వెంటనే బస్సును ఆపేసి ప్రయాణీకులను కిందకు దించాడు. ఆయిల్‌ట్యాంక్ నుండి వెళ్లే పైపు లీక్ వల్ల మంటలు రేగినట్లు గుర్తించారు. బెంగుళూరు నుండి సూపర్‌లగ్జరీ బస్సును రప్పించి ప్రయాణీకులను అందులో ఎక్కించి పంపారు.

కాగా నెల్లూరుకు చెందిన మరో వోల్వోబస్సే మంగళవారం తెల్లారుజామున మరో ప్రమాదం నుండి బయటపడింది. సోమవారం రాత్రి 11గంటలకు నెల్లూరు నుండి బెంగుళూరుకు బయలుదేరింది. మంగళవారం తెల్లారుజామున బెంగుళూరుకు 15కిలోమీటర్ల దూరంలో హోస్‌కోటై దగ్గర బస్సు అదుపుతప్పి మార్జిన్‌లోకి వెళ్లింది. బస్సును డ్రైవర్ తిరిగి రోడ్డు మీదకు తీసుకొచ్చే సమయంలో హఠాత్తుగా ఇసుకలారీ పక్క నుండి గుద్దింది. దీంతో బస్సు ఒక పక్కకు ఒరిగిపోయింది. అయితే ఈ ప్రయాణీకులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. కాని ప్రయాణీకులు బాగా భయపడ్డారు. ఆర్టీసీ అధికారులు ప్రయాణీకులను మరోబస్సులో ఎక్కించి పంపారు. ఏదేమైనా వరుసగా జరిగిన ప్రమాదాల నేపథ్యంలో నెల్లూరు ఆర్టీసీ అధికారులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సివుంది.

**1953 అక్టోబర్1న ఆంధ్రరాష్ట్ర అవతరణ** ▶ **2014 జూన్ 2 తెలంగాణరాష్ట్ర అవతరణ** ▶ **సీమాంధ్రను నవ్యాంధ్రను చేసుకోవడమే తక్షణ కర్తవ్యం**

***ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి 1953 అక్టోబర్ 1వ తేదీన ఆంధ్ర రాష్ట్రం అవతరించింది. జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించడంతో, ఒకటి రెండయినట్లు...రాష్ట్రం రెండయింది.***

# 1 ఒకటి...

# 2 రెండైన వేళ




అప్పట్లో తెలుగువారంతా కలసి 1న ఆంధ్రరాష్ట్రం ఏర్పడితే, ఇప్పుడు 2న తెలంగాణ ఏర్పడడంతో.. ఒకే భాష, ఒకే జాతి..ఒకటిగానే వున్న రాష్ట్రమంతా రెండుగా విడిపోయింది. అదేమి చిత్రమో!..ఆ తేదీలు కూడా యాదృచ్ఛికంగా, ఒకటి..రెండయిపోయాయి. కొన్ని జీవితాలింతే..కొన్ని జాతకాలింతే అన్నట్లుగా సీమాంధ్ర పరిస్థితి మళ్ళీ మొదటికొచ్చింది. చివరికి రాజధాని కూడా లేని ఏకాకి రాష్ట్రంలా సీమాంధ్ర పరిస్థితి దయనీయంగా తయారైంది. మరోవైపు రాష్ట్రం రెండుగా విడిపోయి..ఎలాంటి సమస్యలు ఉత్పన్నమవుతాయో తెలియని సందిగ్ధ పరిస్థితి ప్రజలను లోలోపలే తీవ్ర ఆవేదనకు, ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా సీమాంధ్ర ఆర్థిక పరిస్థితులు, సాగునీటి సమస్యలు, విద్యుత్ సమస్యలు, విద్య–వైద్యం, ఎంతో ప్రధానమైన వ్యవసాయం, పరిశ్రమలు వంటి ప్రాధాన్యతా రంగాల స్థితి ఎలా వుంటుందో?.. మళ్ళీ మొదటినుంచీ వాటిని ఎలా అభివృద్ధి చేసుకోవాలో..అంతా అర్థం కాని అయోమయ పరిస్థితి. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయినప్పుడూ, మళ్ళీ ఇప్పుడు హైదరాబాద్‌ను వీడి, సీమాంధ్రగా మిగిలినప్పుడూ ఇవే బాధలు..ఇలాంటివే సమస్యలు..కాకుంటే నాటికీ నేటికీ కొంత మార్పు వుండవచ్చు గాక, సమస్యలు మాత్రం జటిలమైనవే. అయినా, సీమాంధ్రకు ఇప్పుడు కావాల్సినంత భరోసా వుంది. ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వున్న వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం..ఒక మంచిదారిగా కనిపిస్తోంది. మరోవైపు అటు దేశ సమగ్రాభివృద్ధిని, ఇటు రాష్ట్ర సమగ్రాభివృద్ధినీ మనసా వాచా కాంక్షించే దేశ ప్రధాని నరేంద్రమోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఈ నెల 8న ప్రమాణ స్వీకారం చేయనున్న టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ఇద్దరూ సీమాంధ్ర ప్రజల అభ్యున్నతికి భరోసా ఇవ్వడం ప్రజలకు ఎంతో ఊరట కలిగిస్తోంది. ఆ ఇద్దరు నేతల సారథ్యంలో ఇక సీమాంధ్ర కష్టాలన్నీ తీరిపోతాయనే విశ్వాసం ప్రజల్లో కనిపిస్తోంది. ప్రారంభంలో కొన్ని అవరోధాలుంటే ఉండవచ్చు గాక, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సీమాంధ్ర మళ్ళీ వూహించనిరీతిలో అద్వితీయమైన పురోగతి సాధించి, అచిర కాలంలోనే తన ఉనికిని..అభివృద్ధిని చాటుకుంటుందనే అచంచలమైన విశ్వాసం ప్రజలకు కలుగుతోంది. ఏపుగా..నిండైన పచ్చటి కొమ్మలతో పదుగురికీ చల్లటి నీడనిస్తూ ఎదుగుతున్న చెట్టు.. ఏ గాలివాటుకో మధ్యకు విరిగిపోతుంది..అప్పుడు ఆ చెట్టు గుండె చెదిరిపోతుంది. ప్రతి కొమ్మా... కరిగి కరిగి కన్నీరైపోతుంది. అయినా.. మళ్ళీ గుండెను దిటవు పరచుకుంటుంది చెట్టు. ఎండిపోతున్న ఆ మోడు నుంచే నిబ్బరంగా ఆశలమోసులెత్తుతుంది. తిరిగి చివుళ్ళెత్తి.. కొమ్మలతో..పూల రెమ్మలతో కళకళలాడుతుంది...ఇప్పుడు దాదాపు ఇలాంటిదే సీమాంధ్ర పరిస్థితి కూడా. ఈ చెట్టు ఇప్పటికే పలుసార్లు అనేకానేక తుఫాన్ల దెబ్బకు..అన్యాయాల పెనుగాలుల ధాటికి విరిగిపోతూనే వుంది..అయినా, మొక్కవోని దీక్షతో ఎదిగి.. నవనవోన్మేషంగా తిరిగి చివురిస్తూనే వుంది. తెలుగువారి కోసం తెలుగు రాష్ట్రంగా 1953 అక్టోబర్ 1న ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రం, 1956 నవంబర్ 1న తెలంగాణతో కలిపి 23జిల్లాల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా అవతరించింది. దాదాపు 61 సంవత్సరాల తర్వాత మళ్ళీ ఇప్పుడు 23 జిల్లాల ఆంధ్రప్రదేశ్.. 13 జిల్లాలుగా మళ్ళీ ఇప్పుడు కొత్తగా ప్రయాణం ప్రారంభించాల్సివస్తోంది. కనీసం ఇప్పుడు రాజధాని కూడా లేని పరిస్థితి. రాజధాని ఎక్కడ పెట్టుకోవాలో వెతుక్కోవాల్సిన దుస్థితి. ఒక అస్తవ్యస్త పరిస్థితి నుంచి సీమాంధ్ర ప్రగతిదారిని వెతుక్కోవాల్సివస్తోంది. అయినా ఫర్వాలేదు. గాలివాటుకు ఊగిసలాడుతున్న నావకు సరైన సమయంలో సరైన నావికుడు..చుక్కాని లభించినట్లు, రాష్ట్ర ప్రగతికి దిశానిర్ధేశం చేసే నేతలకు ఇప్పుడు కొదవలేదు. కావాల్సిందల్లా పట్టుదల మాత్రమే. హైదరాబాద్ లేని లోపం..సీమాంధ్రకు తీరని శోకమే అయినప్పటికీ.. తప్పదు. ఒక్క హైదరాబాద్ కాదు..ప్రతి నగరాన్నీ ఒక రాజధాని నగరంలా అభివృద్ధి చేసుకోవాలి. ఎన్నెన్నో కష్టాలనూ నష్టాలను అధిగమిస్తే తప్ప ఇప్పుడు రాష్ట్రం ప్రగతి పథాన్ని చేరుకోలేదు. అయినా మనోనిబ్బరంతో అన్ని సమస్యలనూ, సవాళ్ళనూ అధిగమించాల్సిందే. ఆర్థిక లోటు భారీగానే వున్నా అందుకు తగ్గ ప్రత్యామ్నాయ పథకాలతో ఆ లోటునుంచి బయటపడాల్సిందే. విద్యుత్, వైద్యం, విద్య, నీటిపారుదల తదితర ప్రాధాన్యతా రంగాల్లో లోటుపాట్లను సరిదిద్దుకోవాల్సిందే. మనసుకు తగిలిన గాయాలను.. మనమే కన్నీటితో మాన్పుకోవాలి.. కాలం అనేక సమస్యలకు పరిష్కారం చూపుతుంది. అన్ని గాయాలను మాన్పుకుంటూ పోతుంది.. కాలం!.. అందరి క్షేమాన్నీ అభిలషిస్తూ.. ప్రగతి రథాన్ని ముందుకు సాగనిస్తూ ..ధీరగంభీరంగా సాగిపోవడమే తక్షణ కర్తవ్యం. కలతలనుంచి, కన్నీళ్ళ నుంచి బయటపడి, వేదనలూ..రోదనలకు స్వస్తి చెప్పి...ప్రగతి దారులెంట అందరం కలసి నడిస్తే ప్రగతి కూడా మనతో కలసి నడుస్తుంది. మనిషి తలచుకుంటే సాధ్యం కానిదేమీ వుండదు. కృషితో నాస్తి దుర్భిక్షం..అన్నట్లుగా కృషి..పట్టుదల వుండాలే కానీ, సాధ్యం కానిదేదీ లేదు.నూతన నవ్యాంధ్ర నిర్మాణానికి అటు నాయకులే కాదు...ఇటు ప్రజలూ..ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాల్సిందే. అప్పుడే..అందరూ ఆకాంక్షించే నవ్యాంధ్ర సాధ్యమవుతుంది. అప్పుడే.. సీమాంధ్ర.. ఒక నవ్యాంధ్రగా.. భవ్యాంధ్రగా.. దివ్యాంధ్రగా తిరిగి పరిఢవిల్లుతుంది.







స్థాపితము: 1997



డా॥ బెజవాడ గోపాలరెడ్డి ఉమెన్స్ అకాడమి

(మహిళల డిగ్రీ కళాశాల, శ్రీ విక్రమ సింహపురి యూనివర్శిటీకి అనుబంధము) ఇంగ్లీష్ మీడియం మాత్రమే

శ్రీ కస్తూరిదేవి విద్యాలయం ప్రాంగణము, దర్గామిట్ట, నెల్లూరు - 524003. ఫోన్: 0861 - 2326461, సెల్: 9492200461, 9052171442.

అత్యుత్తమం

- ప్రత్యేకంగా మహిళల కోసమే ఏర్పాటు చేయబడిన ప్రైవేట్ కళాశాల.
- మహిళల విద్యాభ్యాసానికి ఎన్నదగిన కళాశాల.
- మెరిట్ స్కాలర్‌షిప్‌లు పొందగలిగే అవకాశం.
- మహిళా విద్యార్థులకు అత్యంత భద్రతకలిగిన ప్రాంగణం.
- వివిధ పరిశ్రమలకు కావలసిన సాంకేతిక మరియు నైపుణ్యాలలో శిక్షణ.
- జె.కె.సి వారి కాంపస్ ప్లేస్‌మెంట్(సిపిఎం)లో శిక్షణ.
- మహిళా విద్యార్థులలో దాగిన నైపుణ్యాన్ని పూర్తిస్థాయిలో వెలికి తీయగలిగిన సంస్థ.
- నాయకత్వ లక్షణాలను పెంపొందించగలిగే "రోటరాక్ట్ క్లబ్".
- Eplus Club సదుపాయము.
- విద్యార్థినులకు ఉపకార వేతనములు.
- కాలుష్యరహిత ఆహ్లాదకరమైన ప్రాంగణము.

అడ్మిషన్లు జరుగుచున్నవి.
ముందుగా రండి...
మొదటి శ్రేణిలో నిలవండి.

శ్రీ కస్తూరిదేవి విద్యా సంస్థల ఆధ్వర్యంలో స్థాపించబడి గత 16 సంవత్సరములుగా అత్యున్నత ఫలితాలు సాధిస్తున్న మహిళా డిగ్రీ కళాశాల

కోర్సులు

B.Sc.,
1. మ్యాథమేటిక్స్ - స్టాటిస్టిక్స్ - కంప్యూటర్ సైన్స్
2. బయోటెక్నాలజీ - కెమిస్ట్రీ - కంప్యూటర్ అప్లికేషన్స్
3. మైక్రో బయాలజీ - జువాలజీ - కెమిస్ట్రీ
4. బయోటెక్నాలజీ - జువాలజీ - కెమిస్ట్రీ
5. మైక్రోబయాలజీ - బయోకెమిస్ట్రీ - కెమిస్ట్రీ

మరియు

6. B.Com., (కంప్యూటర్ అప్లికేషన్స్)

పరిపూర్ణ విద్యావికాసం
సంపూర్ణ అక్షర సమాజం
డా॥ గోపాలరెడ్డి గారి ఆశయం.

2012 - 13 RESULTS

3rd Year out of 33 we got 20 Distinctions.
2nd Year out of 30 we got 18 Distinctions.
1st Year out of 30 we got 20 Distinctions.

3rd Bcom 100% Pass.

1st Bcom 100% Pass.

Overall Pass Percentage 90%

3rd Year pass percentage 91%
Bcom - 100%
Bsc - 85%

2nd year pass percentage 83%
Bcom - 81%
Bsc - 86%

1st year pass percentage 94%
Bcom - 100%
Bsc - 95%
Bsc(Bio-Technology) - 90%

100% Marks:-
Maths I - 4 Maths II - 7
Maths III - 4 Maths IV - 3
Stat I - 2

జె.వి.రెడ్డి
సెక్రటరీ మరియు కరస్పాండెంట్

మీ కలలకు సాకారం - శ్రీ కస్తూరిదేవి విద్యాలయం ప్రాంగణంలో శ్రీకారం.

# గూడూరు డివిజన్ వార్తలు

## దాతల సహకారం అభినందనీయం

- డీఎఫ్‌వో



నీటి పథకాన్ని ప్రారంభిస్తున్న అగ్నిమాపకశాఖాధికారి శ్రీనివాసులు

దాతల సహకారంతో అగ్నిమాపక కేంద్రంలో వసతులు కల్పించడం అభినందనీయమని డీఎఫ్‌వో శ్రీనివాసులు ప్రశంసించారు. గూడూరు పట్టణంలోని అగ్నిమాపక కేంద్రానికి రోటరీక్లబ్ దాతృత్వంతో ఏర్పాటుచేసిన బోరు పాయింట్‌ను జిల్లా అగ్నిమాపకాధికారి శ్రీనివాసులు, సహాయ జిల్లా అగ్నిమాపకాధికారి సత్యనారాయణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని దాతల సహకారంతో అగ్నిమాపక కేంద్రానికి కావాల్సిన మౌలిక వసతులను సమకూర్చుకున్నామన్నారు. కేంద్రంలో నీటిసరఫరా లేకపోవడంతో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సకాలంలో చేరుకోలేకపోతున్నామన్నారు. నీటి సరఫరా లేకపోవడంతో ప్రమాదాలను నివారించేందుకు సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. దాత దశరథ రామిరెడ్డి ముందుకు వచ్చి కార్యాలయంలో నీటి సరఫరా చేసేందుకు 70వేలు వెచ్చించి బోర్ పాయింట్ వేయించడం ఎంతో సంతోషకరమన్నారు. దాత దశరథరామిరెడ్డి మాట్లాడుతూ అగ్నిమాపక కేంద్రానికి నీటివసతి కల్పిస్తే గ్రామీణ ప్రాంతవాసులకు సేవచేసిన వారవుతామన్నారు. కేంద్రానికి తూర్పు వైపు ప్రహరీగోడ లేదని డీఎఫ్‌వో సూచించడంతో డాక్టర్ సి.ఆర్.రెడ్డి ముందుకు వచ్చి ప్రహరీగోడను డీఆర్ డబ్ల్యూ కళాశాల సాయంతో రోటరీక్లబ్ ఆధ్వర్యాన నిర్మిస్తామన్నారు. ఆవరణలో కాలుష్యాన్ని నివారించేందుకు ఓ మొక్కను పట్టణ ప్రముఖులు డాక్టర్ సిఆర్ రెడ్డి చేతుల మీదుగా అగ్నిమాపక కేంద్రం ప్రాంగణంలో నాటించారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు మయూరిశ్యాం, కేంద్ర అధికారి పెంచలయ్య, క్లబ్ ప్రతినిధులు నాగసూరు గోపాలయ్య, రాజేంద్రప్రసాద్, కె.సుందరరామిరెడ్డి, జీడీ రెడ్డి, కె.మునిగిరీష్, దయాకరరెడ్డి, రత్నం, ఎంపీ మల్లయ్య, కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ప్రముఖ వైద్యుడు సి.ఆర్.రెడ్డి

## గూడూరు రెండవ పట్టణ విఆర్వో మృతి

గూడూరు రెండవ పట్టణ వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న చిల్లకూరు గ్రామానికి చెందిన సి. హెచ్. అంకయ్య 45సం॥లు సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. గూడూరు తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వోగా పనిచేస్తున్న ఆయన మూడు నెలలుగా క్యాన్సర్‌తో బాధపడుచున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అంకయ్య మృతి పట్ల గూడూరు ఆర్డీవో శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. 10వేలు రూపాయలు ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబీకులకు అందజేశారు. తహశీల్దార్ ఇస్మాయిల్, డివిజన్ వీఆర్వోల సంఘ అధ్యక్షుడు రమణయ్య, కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితర నాయకులు అంకయ్య మృతి పట్ల సంతాపం తెలియజేశారు.

## బలహీన చిన్నారులకు 'బాలామృతం'

పోషకాహార లోపంతో బాధపడే చిన్నారులకు 'బాలామృతం' పథకం ద్వారా రోజుకు 100మిల్లీ లీటర్ల పాలు సరఫరా చేయనున్నట్లు పట్టణ సీడీపీవో ఉమా మహేశ్వరి తెలిపారు. గూడూరు రెండవ పట్టణంలోని నరసింహారావుపేట వద్దనున్న బాలసదన్‌లో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో 156 మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నట్లు గుర్తించామని అన్నారు. వారందరికీ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి చిన్నారికి రోజుకు 100ఎంఎల్ పాలు, పిండి అందించనున్నామన్నారు. తద్వారా చిన్నారుల్లో పోషకశక్తిని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### అండర్ బ్రిడ్జి వద్ద పనిచేయని సిగ్నల్స్

## ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు




రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రోజు పలు పర్యాయాలు తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీనికి కారణం అక్కడ ఏర్పాటు చేసిన సిగ్నల్స్ పనిచేయకపోవడమేనని తెలుస్తోంది. తరచూ ట్రాఫిక్ జామ్ అవుతూ వాహనచోదకులు పడరాని పాట్లు పడుతున్నారు. ఎదురెదురుగా వాహనాలు అండర్ బ్రిడ్జి మధ్యలోకి వచ్చేసి అక్కడ ఇరుక్కుపోవడంతో ఆ ప్రాంతంలో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఈ మార్గంలో వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. తరచూ ట్రాఫిక్ జామై అంత రాయం కలుగుతుండడంతో నెల్‌క్యాస్ట్ పరిశ్రమ యాజమాన్యం వారి సహకారంతో అక్కడ సిగ్నల్స్ ఏర్పాటుచేశారు. కానీ వాహనచోదకులు వాటిని పాటించకుండా యధాతథంగా వెళ్ళిపోతున్నారు. గతంలో ఆ ప్రాంతంలో ఇరువైపులా హోమ్‌గార్డులను ఉంచి ట్రాఫిక్‌ను క్రమ బద్ధీకరించారు. ప్రస్తుతం అక్కడ ఏర్పాటు చేసిన సిగ్నల్స్ మరమ్మత్తులకు గురయ్యాయి. అలాగే ఆ ప్రాంతంలో హోమ్ గార్డులను కూడా సక్రమంగా ఉంచడం లేదు. దీంతో రోజులో పలుమార్లు అండర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్‌జామ్ అవుతూనే ఉంది. ఒకటో పట్టణం నుంచి రెండో పట్టణానికి వెళ్లాలన్నా, రెండో పట్టణం నుంచి ఒకటో పట్టణానికి రావాలన్నా ఆ మార్గం ఒక్కటే. ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతుందే కానీ అది ఇప్పట్లో పూర్తయ్యేలాలేదు. అదే విధంగా తరచూ రైల్వే లైను మరమ్మత్తు పనులు జరుగుతూ ఆ మార్గంలో కూడా వాహనాలు వెళ్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఆ ప్రాంతంలో సిగ్నల్స్ మరమ్మతులు చేయించడంతో పాటు ఇరువైపులా హోమ్‌గార్డులను ఏర్పాటు చేసి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని పట్టణ ప్రజలు పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



అండర్ బ్రిడ్జి వద్ద ఇరుక్కుపోయిన వాహనాలు

## పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వాన్నం

గూడూరు పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా తయారైంది. ప్రధాన వీధుల్లో చెత్త కూడా ఎత్తడం లేదు. కాలువలు పూడికతో నిండిపోయాయి. దీంతో మురుగునీరు వీధుల్లో నిల్వ ఉంటుంది. ఓ వైపు దుర్వాసన, మరోవైపు మురుగుతో రాకపోకలు సాగించలేక నానాఇబ్బందులు పడుతున్నారు. గత కొద్ది రోజులు కుమ్మరవీధి, సీవీసీ పార్కు రోడ్డు, వివేకానందరోడ్డు, వాటర్ ట్యాంకు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. అది కాకుండా మురుగు కాలువలపై ఆక్రమణలు వెలవడడంతో నీరు పారడం లేదు.

పురపాలక సిబ్బంది కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించి, పారిశుద్ధ్యం మురుగునీరు వీధుల్లో నిల్వ లేకుండా చేసి, పారిశుద్ధ్యం మెరుగు పరచుటకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజానీకం కోరుచున్నారు.

### ద్రౌపది సమేత ధర్మరాజస్వామి

## ఉత్సవాలపై సమీక్ష

గూడూరు పట్టణంలోని ద్రౌపది సమేత ధర్మరాజస్వామి ఆలయ ఉత్సవాలను నిర్వహించేందుకు శనివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో వివిధ సంఘాల నాయకులతో ఈవో తాతా శ్రీనివాసరావు, ఆలయ ఛైర్మెన్ గోపాలయాదవ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1991లో ఉత్సవాలను నిర్వహించారని అప్పటి నుంచి ఇప్పటి వరకు నిర్వహించలేదన్నారు. ఈ ఏడాదైనా స్వామి వారి ఉత్సవాలను నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. 22రోజులపాటు ఉత్సవాలను నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ కులసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## తాళమ్మ పొంగళ్లు

గూడూరు గ్రామ దేవత తాళమ్మకు ఆదివారం భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. గూడూరు పట్టణం నుంచే కాక చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చారు. అమ్మవారికి ముఖ్యమైన ఆదివారం కావడంతో అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి కుంకుమార్చన పూజలు అనంతరం అభిషేక కార్యక్రమాలు జరిగాయి. కాటమయ్య, గంగమ్మకు కూడా పూజలు జరిపారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.













## నాయుడు గారూ!

విద్యార్థి నాయకుడిగా ఉద్యమాలకు ఊపిరిపోసి శాసనసభ్యుడిగా అసెంబ్లీలో అధికారపక్షాన్ని గడగడలాడించి 'అసెంబ్లీ టైగర్' అని అరుదైన గౌరవం పొందారు.

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉద్యమాలే ఊపిరిగా పోరాట పటిమ చూపించి పార్టీని పల్లెపల్లెన విస్తరించి బహుళ ప్రాచుర్యంలోనికి తెచ్చారు. అఖిలభారత ప్రధానకార్యదర్శిగా అలుపెరుగని గళంతో - విరామమెరుగని పయనంతో దేశం అంతా పర్యటిస్తూ సంఘటనా కౌశల్యాన్ని చూపించారు. అధికారప్రతినిధిగా మీ వాక్‌చాతుర్యాన్ని, వాగ్ధాటిని ప్రదర్శించారు. అధికార పార్టీ అఖిల భారత అధ్యక్షుడిగా శ్రీ అటల్‌జీ - అద్వానీజీల మధ్య కూర్చుని బాధ్యతలు నిర్వహిస్తూ పలు అభివృద్ధి పథకాల రూపకల్పనలో భాగస్వామి అయ్యారు.

గ్రామీణాభివృద్ధి మంత్రిగా ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన రూపకర్తగా గ్రామీణాభివృద్ధి శాఖకే వన్నెతెచ్చి ప్రజల మన్ననలను పొందారు. ఏ పదవిలో ఉన్నా దానికి వన్నె తెచ్చి మీ ప్రత్యేకతను చాటారు.

రాష్ట్ర విభజన సమయంలో అర్థవంతమైన ప్రసంగం చేసి, నిర్మాణాత్మకమైన భూమిక వహించి, తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్రాన్ని సమర్థిస్తూనే ఆంధ్ర ప్రాంత ప్రజలకు అన్యాయం జరగకుండా అధికార పార్టీ మెడలు వంచి అనేక హామీలను సాధించి తెలుగు ప్రజలకు న్యాయం చేశారు.

తెలుగుగడ్డపై జన్మించి, తెలుగు తేజాన్ని చూపి జాతీయస్థాయిలో తెలుగుజాతికి తలమానికంగా నిలిచిన మీరు మాకు గర్వకారణం. అన్నదమ్ములుగా విడిపోయి అభివృద్ధి పథంలో సోదరులుగా సహకరించుకుంటున్న రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలకు మీ నాయకత్వం ఎంతో అవసరం.

2014 ఎన్నికల ప్రచారంలో శ్రీ నరేంద్ర మోడీ నాయకత్వాన్ని నలుదిశలా వ్యాపింపజేసి ఇతర సహచరులతో కలిసి పార్టీ చారిత్రాత్మక విజయంలో ప్రధాన భూమిక వహించారు.

నేడు వేగంగా పెరుగుతున్న పట్టణీకరణను దృష్టిలో పెట్టుకుని ప్రధానమంత్రి అప్పజెప్పిన **పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మరియు పేదరిక నిర్మూలన శాఖల మంత్రిగా** మరియు ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నత వేదికైన పార్లమెంటులో సమన్వయం సాధించేందుకు, సభను సజావుగా నడిపేందుకు **పార్లమెంటరీ వ్యవహారాల మంత్రివర్యులుగా** బాధ్యతలు చేపట్టిన శుభసందర్భంగా

**మీకు మా శుభాభినందనలు.**

**బి.సుబ్బారెడ్డి**
**వంశీరామ్ బిల్డర్స్**
హైదరాబాదు.



**శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు**
గౌరవ కేంద్రమంత్రివర్యులు
పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ, పేదరిక నిర్మూలన మరియు
పార్లమెంటరీ వ్యవహారాలు

Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.